RNI No. APTEL/2012/53127

TELANGANA VANI TELUGU DAILY

# తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక

The Voice of Telangana

Published From KARIMNAGAR, HYDERABAD, ADILABAD, NIZAMABAD, WARANGAL, KHAMMAM, NALGONDA,

సంపుటి: 16 సంచిక 21 ఎడిటర్: జేరిపోతుల సంపత్, కరీంనగర్ శనివారం 25-04-2026 పేజీలు: 8, వెల : 2.00

తెలంగాణ వాణి

R N I No. APTEL/2012/53127

The Voice of Telangana

విలేకరులు కావలెను

తెలంగాణ వాణి దినపత్రికలో పనిచేయుటకు సిటీ బ్యూరో, జిల్లా బ్యూరోలు, నియోజకవర్గం, మండలాలవారీగా అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను. ఆసక్తిగలవారు ఈ క్రింది నెంబరుకు సంప్రదించగలరు.

9182328292



2వ పేజీలో...

ఒప్పందం కుదరకపోతే..

## దాడులే

### ఇరాన్‌కు ట్రంప్ గట్టి హెచ్చరిక

- చర్చలు విఫలమైతే సైనిక చర్య తప్పదన్న ట్రంప్
- ఇప్పటికే 75 శాతం ఇరాన్ లక్ష్యాలను ధ్వంసం చేశామని వెల్లడి
- హర్మూజ్ జలసంధిని మూసివేసి ఆర్థికంగా దెబ్బతీస్తున్నామన్న ట్రంప్
- ఇరాన్‌ను అణ్వస్త్ర దేశంగా మారనీయబోమని స్పష్టీకరణ
- తాము అణ్వాయుధాలను ఉపయోగించబోమని హామీ

వాషింగ్టన్: ఇరాన్‌తో చర్చలు విఫలమైతే సైనిక చర్య పునఃప్రారంభించే అవకాశం ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంకేతాలిచ్చారు. అయితే, ఒప్పందం కుదుర్చుకోవడానికి తనకేమీ తొందరలేదని స్పష్టం చేశారు. శాశ్వతమైన ఒప్పందం కోసమే చూస్తున్నానని, ఒకవేళ టెహ్రాన్ ఒప్పుకోకపోతే మిగిలిన 25 శాతం లక్ష్యాలను కూడా సైనిక చర్య ద్వారా పూర్తి చేస్తానని ఆయన అన్నారు. ఇప్పటికే జరిగిన దాడుల్లో ఇరాన్ సైన్యాన్ని పూర్తిగా ఓడించామని ట్రంప్ పేర్కొన్నారు.



2వ పేజీలో...

ఆర్టీసీ సమ్మెకు బలయిన

## శంకర్‌గౌడ్

- పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం
- చికిత్స పొందుతూ హైదరాబాద్‌లో మృతి
- సిఎం రేవంత్ సంతాపం, మంత్రి పొన్నం సంతాపం

హైదరాబాద్,: ఆర్టీసీ సమ్మెపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డ నర్సంపేట డిపో ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి చెందారు. హైదరాబాద్ అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. అపోలో ఆస్పత్రిలో శంకర్ గౌడ్ మృతదేహానికి పోస్టుమార్టం పూర్తైంది. బంధువులకు శంకర్ గౌడ్ మృతదేహాన్ని అప్పగించారు. స్వస్థలానికి శంకర్ గౌడ్ మృతదేహం తరలించారు. గురువారం ఆర్టీసీ డ్రైవర్ పెట్రోల్ పోసుకొని నిప్పంటిచుకున్న విషయం తెలిసిందే. గత రెండ్రోజులుగా ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగిన విషయం తెలిసిందే. ఈ సమ్మెలో భాగంగా గురువారం రాష్ట్రంలోని అనేక చోట్ల కార్మికులు నిరసనలు చేపట్టారు. ఈ క్రమంలోనే వరంగల్ జిల్లా నర్సంపేట ఆర్టీసీ డిపో ఎదుట కార్మికులు నిరసన చేపట్టారు. ఈ సమ్మెలో పాల్గొన్న శంకర్‌గౌడ్ (55) పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఆయనను వెంటనే వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అప్పటికే 80 శాతం కాలినగాయాలు కావడంతో హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందారు. అత్యక్రియలకు ప్రముఖ రాజయకీయ నాయకులు హాజరుకానున్నారు.



కేరళను ఠారెత్తిస్తున్న

## ఎండలు

గతంలో ఎప్పుడూ లేనంతగా ఉష్ణోగ్రతలు
స్వీయ నిర్బంధంతో ఇంట్లోనే ఉండాన్న సిఎం

తిరువనంతపురం,: కేరళలో గత రెండు రోజులుగా ఎండలు మండిపోతున్నాయి. ఆ రాష్ట్రంలో అధిక తేమతో కూడిన త్రీవమైన వేడి కనీసం ఏప్రిల్ 27 వరకు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ డైరెక్టర్ నీతా కె. గోపాల్ వెల్లడించారు. వడదెబ్బకు ఇప్పటికే ఆ రాష్ట్రంలో ఒకరిద్దరు మరణించారు. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ కోవిడ్-19 తరహాలో ఇప్పుడు సెల్ఫ్ లాక్ డౌన్ అంటే స్వీయ నిర్బంధం పాటించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. తీవ్రమైన ఎండ తగిలే సమయాల్లో నేరుగా సూర్యరశ్మికి గురికాకుండా ఉండేందుకు ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల మధ్య అనవసర ప్రయాణాలు, బహిరంగ ప్రదేశాలలో పనులు మానుకోవాలని ఆయన సలహా ఇచ్చారు. అలాగే ఈ సమయంలో బహిరంగ ప్రదేశాల్లో సమావేశాలు, క్రీడా కార్యక్రమాలు నిషేధించ నున్నట్లు వెల్లడించారు.

## బెంగాల్‌లో జగిల్ రాజ్ ఖేల్ ఖతం

కోల్‌కతా, ఏప్రిల్24 : పశ్చిమ బెంగాల్‌లో నమోదైన భారీ పోలింగ్.. రాష్ట్రంలో మమత ఆధ్వర్యంలోని టీఎంసీ జంగిల్ రాజ్ పాలనకు అంతం అని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. బెంగాల్‌లోని డుమ్ డుమ్‌లో శుక్రవారం జరిగిన బీజేపీ ప్రచార సభలో మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడి టీఎంసీ ప్రభుత్వంపై కీలక వ్యాఖ్యలు చేశారు. పశ్చిమ బెంగాల్‌లో గురువారంజరిగిన తొలి దశ ఓటింగ్‌లో భారీ స్థాయిలో పోలింగ్ నమోదైన సంగతి తెలిసిందే. ఈ అంశంపై కూడా మోదీ మాట్లాడారు. తొలి దశ ఎన్నికల్లో రికార్డ్ స్థాయిలో పోలింగ్ నమోదైందంటే అది టీఎంసీ మహా జంగిల్ రాజ్ ప్రభుత్వానికి అంతం మొదలైనట్లే. రాష్ట్రంలో బీజేపీ కచ్చితంగా అధికారంలోకి వస్తుంది. బీజేపీకి అండగా నిలుస్తున్న మహిళా ఓటర్లకు ధన్యవాదాలు.



2వ పేజీలో...

భారీ ఓటింగ్ బిజెపి అధికారానికి సూచిక
టిఎంసి పూర్తి మహిళా వ్యతిరేక పార్టీ
ప్రచారంలో ప్రధాని మోడీ విమర్శలు





కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులకు

## హైకోర్టులో ఊరట

హైదరాబాద్, ఏప్రిల్ 24 : హైదరాబాద్‌లో 2011లో జరిగిన మిలీనియం మార్చ్ కేసుకు సంబంధించి తాజాగా కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో అప్పటి టీఆర్ఎస్ (ప్రస్తుతం బీఆర్ఎస్) నేతలు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులపై నమోదైన క్రిమినల్ కేసులను తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. ఈ తీర్పుతో వారికి న్యాయపరంగా పెద్ద ఊరట లభించింది.

## ముత్తోజిపేటలో తీవ్ర ఉద్రిక్తత

శంకర్ గౌడ్ మృతదేహాన్ని డిపోకు తీసుకెళ్లకుండా అడ్డంకులు
పోలీసుల తీరుపై మండిపడ్డ ఆర్టీసీ కార్మికులు
డిపోకు తీసుకెళితే నష్టమేంటని బండి సంజయ్ ప్రశ్న

వరంగల్, ఏప్రిల్24 : వరంగల్ జిల్లా నర్సంపేట మండలం ముత్తోజిపేటలో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఆత్మహత్య చేసుకున్న ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతదేహాన్ని డిపో వరకు తీసుకెళ్లేందుకు కార్మికులు యత్నించారు. నర్సంపేట డిపో వద్ద మృతదేహానికి నివాళులర్పిస్తామని చెప్పారు. అందుకు పోలీసులు అంగీకరించలేదు. మృతదేహాన్ని తీసుకెళ్లకుండా అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు, కార్మికులకు మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకున్నాయి. కార్మికులు నినాదాలు చేశారు. శంకర్‌గౌడ్ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో శంకర్ గౌడ్ మృతదేహాన్ని నర్సంపేట డిపోనకు తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి యత్నించారు. దీంతో పోలీసులను వారిని అడ్డుకుని అరెస్టు చేశారు.

2వ పేజీలో...



ఆర్టీసీ జేఏసీ నేతలతో...

## మంత్రుల బృందం భేటీ

2వ పేజీలో...

- సమావేశంలో పాల్గొన్న మంత్రులు
- శంకర్ గౌడ్ మృతిపట్ల మంత్రులు, జేఏసీ నేతల సంతాపం
- 29 అంశాలకు సానుకూలంగా ఉన్నట్లు తెలిపిన మంత్రులు
- మూడు అంశాలపై అధ్యయనం చేయాలన్న మంత్రులు

లిఖితపూర్వక హామీకి జేఏసీ నేతల డిమాండ్

చర్చలతోనే పరిష్కారం..

## ప్రాణాలు తీసుకోవద్దు

ఆర్టీసీ నేతలతో భట్టి విక్రమార్క



హైదరాబాద్, ఏప్రిల్ 24 : ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతిపై తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. సచివాలయంలో మంత్రుల బృందంతో కలిసి జేఏసీ నేతలతో భేటీ అయిన ఆయన, సమస్యలు ఎంత క్లిష్టమైనా చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలని, ప్రాణాలు తీసుకోవడం సరైన నిర్ణయం కాదని హితవు పలికారు. ఇది మనందరి 'ప్రజా ప్రభుత్వం' అని, ఎవరినీ శత్రువులుగా చూసే స్వభావం తమకు లేదని స్పష్టం చేశారు. గత పదేళ్లలో ఆర్టీసీ చిన్నాభిన్నమైందని, అప్పట్లో కార్మికుల పట్ల పాలకులు కఠినంగా వ్యవహరించారని అన్నారు. తాము అలా చేయబోమని భరోసా ఇచ్చారు. వివిధ రాష్ట్రాల ఎన్నికల ప్రచారం, ఇతర ప్రభుత్వ పనుల వల్ల తాము బిజీగా ఉన్న సమయంలో అకస్మాత్తుగా సమ్మె నిర్ణయం తీసుకోవడం వల్లే శంకర్ గౌడ్‌ను కోల్పోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీని బలోపేతం చేసి, కార్మికుల సమస్యలను సానుకూల దృక్పథంతో పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు.



పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో

## విజయం బీజేపీదే

మొదటిదశలో 110కి పైగా సీట్లు గెలుస్తాం
కేంద్రహోంమంత్రి అమిత్ షా ధీమా

కోల్‌కతా,: పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం బీజేపీదే అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. మొదటి దశ ఎన్నికల్లో 152 స్థానాలకు గాను బీజేపీ 110కి పైగా సీట్లు కైవసంచేసుకుంటుందనిధీమా వ్యక్తం చేశారు. పశ్చిమ బెంగాల్ పర్యటనలో ఉన్న ఆయన కోల్‌కతాలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ.. పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో బీజేపీ విజయం తథ్యమన్నారు. రెండో దశ లోనూ తామే ఎక్కువ సీట్లు నెగ్గుతామన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేది బీజేపీనే అంటూ ప్రకటించారు. మమతా బెనర్జీ, టీఎంసీ ప్రభుత్వానికి ఘోర పరాజయం తప్పదని హోంమంత్రి అమిత్ షా జోస్యం చెప్పారు. అందుకు మొదటి దశలో 92.88 శాతం ఓటింగ్ నమోదు కావడమే నిదర్శనమన్నారు.



## శంకర్ గౌడ్ మృతి విషాదకరం

ఈ బలిదానం తీవ్రంగా కలచివేసింది
మాజీమంత్రి హరీష్ రావు ఆవేదన

# అత్యాచారం, హత్యాచారం కేసు

## రాహుల్ మీనాకు నాలుగు రోజుల పోలీస్ కస్టడీ



న్యూఢిల్లీ, : రాజస్థాన్, ఢిల్లీ రాష్ట్రాల్లో అత్యాచారం, హత్యాచారం కేసుల్లో అరెస్టు చేసిన నిందితుడు రాహుల్ మీనాకు నాలుగు రోజుల పాటు పోలీస్ కస్టడీ విధించింది న్యాయస్థానం. ఇద్దరిపై అత్యాచారం చేసి అందులో ఒకరిని హత్య చేసిన కేసుల్లో అతన్ని పోలీసులు గురువారం నాడు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా అతని స్టేట్మెంట్‌ను రికార్డు చేశారు. ఆ సమయంలో పోలీసులకు చుక్కలు చూపించాడు నిందితుడు రాహుల్. విచారణ సమయంలో నిందితుడు తన స్టేట్మెంట్‌ను పలుమార్లు మార్చి చెప్పినట్లు కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు తెలిపారు. అనంతరం నాలుగు రోజుల కస్టడీ కోరుతూ ఢిల్లీ పోలీసులు నిందితుడిని కోర్టులో ప్రవేశపెట్టారు. విచారణ సందర్భంగా 'నా వల్ల నేరం జరిగింది.. తప్పు జరిగిపోయింది' అంటూ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ దీపికా థాకరన్ ఎదుట రాహుల్ మీనా నేరం ఒప్పుకున్నాడు. విచారణ అనంతరం నిందితుడిని నాలుగు రోజుల పాటు పోలీస్ కస్టడీకి న్యాయస్థానం అప్పగించింది. రాజస్థాన్‌లోని అల్వార్‌లో మంగళవారం రాత్రి తన స్నేహితుడి భార్యపై నిందితుడు రాహుల్ మీనా అత్యాచారం చేశాడు. ఆమె భర్త ఇంట్లో లేని సమయంలో లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ తర్వాత ఓ వ్యాన్‌ను రూ. 6 వేల కిరాయికి మాట్లాడుకుని ఢిల్లీకి బయలుదేరాడు. అక్కడికి చేరిన తర్వాత నగదు చెల్లించకుండానే పారిపోయాడు. గతంలో కైలాష్ హిల్స్ ప్రాంతంలో తాను పని చేసిన ఇంటి వద్దకు చేరుకున్నాడు. యజమాని, అతని భార్య జిమ్‌కి వెళ్లడంతో ఉదయం 6:30 గంటలకు ఇంట్లోకి ప్రవేశించాడు. ఒంటరిగా ఉన్న యజమాని కుమార్తెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. మొబైల్ ఛార్జర్ వైర్‌తో ఆమె గొంతు నులిమి హత్య చేశాడు. అనంతరం విలువైన వస్తువులు దోచుకుని పరారయ్యాడు. సీసీటీవీ దృశ్యాల ఆధారంగా నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. గతంలో అక్కడ పని చేసిన సమయంలో నగదు విషయంలో అవకతవకలకు పాల్పడడంతో అతన్ని పని నుంచి తీసేశారు యజమాని. దాన్ని మనసులో పెట్టుకుని ఈ దారుణానికి ఒడికట్టాడు. రెండు రోజుల వ్యవధిలో ఇద్దరిపై అత్యాచారం చేసి అందులో ఒకరిని హత్య చేయడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. పోలీసుల కస్టడీలో నిందితుడు ఇంకా ఎలాంటి విషయాలు వెల్లడిస్తాడో వేచి చూడాల్సిందే.

# ముత్తోజిపేటలో తీవ్ర ఉద్రిక్తత



మొదటిపేజీ తరువాయి...

వారిని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్తుండగా మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ సహా బీఆర్ఎస్ నాయకులు, కార్మికులు అడ్డుకుని వాగ్వాదానికి దిగారు. దీంతో అక్కడ ఉద్రిక్తత కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఆర్టీసీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. నర్సంపేట డిపోకు తీసుకెళ్లకుంటే శంకర్ గౌడ్ ఆత్మ శాంతించదని అన్నారు. నర్సంపేట ఆర్టీసీ డిపోకి శంకర్‌గౌడ్ మృతదేహాన్ని తరలించేదాకా కదిలేది లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. శంకర్‌గౌడ్ మృతదేహాన్ని నర్సంపేట డిపోకు తీసుకెళితే అభ్యంతరం ఏంటని పోలీసులను ప్రశ్నించారు. పోలీసులు అనవసరంగా అడ్డుకుని ఎందుకు శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని మండిపడ్డారు. శంకర్ గౌడ్ కుటుంబ సభ్యుల విజ్ఞప్తి మేరకు ఆర్టీసీ డిపోకు తరలించాలని పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికులు ఆయనను కడసారిగా చూసి నివాళి అర్పిస్తే నష్టమేంటన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్‌కి వరంగల్ పోలీస్ కమిషనర్ ఫోన్ చేసి మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాలను వివరించారు. అయితే శంకర్‌గౌడ్ కుటుంబ సభ్యులు, ఆర్టీసీ కార్మికుల విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకోవాలన్న కేంద్ర మంత్రి సూచించారు. 22 ఏళ్లపాటు నర్సంపేట ఆర్టీసీ డిపోలో శంకర్‌గౌడ్ సేవలందించారని, అక్కడికి తీసుకెళితేనే ఆయన ఆత్మకు శాంతి చేకూరుతుందని ఆర్టీసీ కార్మికులు, కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

# శంకర్ గౌడ్ మృతి విషాదకరం

మొదటిపేజీ తరువాయి...

హైదరాబాద్, :ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ మృతిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు స్పందించారు. శంకర్ గౌడ్ ఆత్మ బలిదానం తీవ్రంగా కలిచివేసిందంటూ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా మాజీ మంత్రి పోస్ట్ చేశారు. శంకర్ గౌడ్ మృతికి సీఎం రేవంత్ రెడ్డిదే బాధ్యత అని అన్నారు. శంకర్ గౌడ్ అమరుడైన రోజును 'అపాయింటెడ్ డే'గా ప్రకటించాలని మాజీ మంత్రి డిమాండ్ చేశారు. 'ఆర్టీసీ కార్మిక సోదరుడు శంకర్ గౌడ్ ఆత్మబలిదానం మా హృదయాలను తీవ్రంగా కలిచివేసింది. సంస్థను కాపాడేందుకు, కార్మికుల హక్కుల కోసం ప్రాణత్యాగం చేసిన శంకర్ గౌడ్‌కు మా ఘన నివాళులు. హక్కుల సాధన కోసం సంఘటితంగా పోరాడాలి తప్ప, ఇలాంటి ఆత్మబలిదానాలకు ఎవరూ ఒడిగట్టవద్దని హృదయపూర్వకంగా మనవి చేస్తున్నాం. శంకర్ గౌడ్ మృతికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదే బాధ్యత. ప్రభుత్వ అలసత్వం, నిర్లక్ష్యం వల్ల ఇలాంటి పరిస్థితి వచ్చింది. అధికారంలోకి రాగానే ఆర్టీసీ విలీన ప్రక్రియను పూర్తి చేస్తామని, ఇతర అన్ని సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి మాట తప్పడం వల్లనే ఈ దుస్థితి. మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాలు కూడా అమలు చేయకుండా ఇంకెన్నాళ్లు కాలం గడుపుతావు రేవంత్ రెడ్డి? ఇలా ఎంతమందిని బలి తీసుకుంటావు? ఆర్టీసీ కార్మికుల న్యాయమైన ఆవేదనను పరిగణలోకి తీసుకొని, ప్రభుత్వం తక్షణమే సమస్యల పరిష్కారానికి చర్యలు ప్రారంభించి, కార్మికుల్లో విశ్వాసం కల్పించాలి. శంకర్ గౌడ్ అమరుడైన రోజును 'అపాయింటెడ్ డే'గా ప్రకటించి, ఆయన త్యాగానికి తగిన గౌరవం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. ఆర్టీసీ కార్మిక సోదరుల్లారా, మీరు చేస్తున్న పోరాటానికి మేమంతా అండగా ఉన్నాం. అధైర్యానికి లోనుకాకండి. కలిసికట్టుగా, న్యాయబద్ధంగా పోరాడి మన హక్కులను సాధించుకుందాం. ఎలాంటి తొందరపాటు చర్యలకు పాల్పడవద్దని మరోసారి మనవి చేస్తున్నాం. జోహార్ శంకర్ గౌడ్' అంటూ హరీశ్ రావు ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

# బెంగాల్‌లో జగిల్ రాజ్ ఖేల్ ఖతం

గురువారం నాడు బీజేపీకి లభించిన మద్దతు పార్టీ విజయ శంఖారావం పూరించినట్లే. బెంగాల్‌లో ఎక్కడ ప్రజాస్వామ్యాన్ని తన నిరంకుశత్వంతో టీఎంసీ అంతం చేసిందో, అక్కడే, మొదటి దశలోనే ప్రజలు ప్రజాస్వామ్య దేవాలయాన్ని నిర్మించడం ప్రారంభించారు. బీజేపీ అధికారంలోకి రాగానే ఆయుష్మాన్ భారత్ యోజన పథకాన్ని వర్తింపజేస్తాం. అర్హులైన వారికి ఐదు లక్షల వైద్యం అందిస్తాం. ప్రభుత్వం ఏర్పడ్డ తొలి క్యాబినెట్ మీటింగ్‌లోనే దీనిపై నిర్ణయం తీసుకుంటాం. టీఎంసీ మహిళా వ్యతిరేక పార్టీ. మహిళలు అభివృద్ధి చెందాలని టీఎంసీ కోరుకోవడం లేదు. మహిళల భద్రతే బీజేపీ మొదటి ప్రాధాన్యం. బెంగాల్ ఆడబిడ్డలు అత్యాచారానికి గురై

మొదటిపేజీ తరువాయి...

న్యాయం కావాలని కోరితే.. ఆడబిడ్డలు బయటకు రాకూడదని టీఎంసీ ప్రభుత్వం చెబుతోంది. మహిళలు కలలు కనడాన్ని టీఎంసీ అంగీకరించదని వ్యాఖ్యానించారు. ఆర్‌జీ కర్ ఆస్పత్రిలో హత్యాచారానికి గురైన బాధిత యువతి తల్లి రత్న దేవ్‌నాథ్‌ను ప్రధాని మోదీ కలిశారు. ఆమెను బీజేపీ ఈ ఎన్నికల్లో తన పార్టీ తరఫున పానిహటి నుంచి బరిలోకి దింపింది. ఈ అంశంపై మోదీ స్పందించారు. రత్న దేవ్‌నాథ్.. తన కూతురును కష్టపడి డాక్టర్ చేసింది. కానీ, టీఎంసీ ప్రభుత్వం ఆమె కూతురును తీసుకెళ్లింది. మేం ఆమె తల్లిని మా అభ్యర్థిగా నిలబెట్టాం అని మోదీ అన్నారు.

# కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులకు హైకోర్టులో ఊరట

మొదటిపేజీ తరువాయి...

మిలీనియం మార్చ్ కేసు నేపథ్యం..: 2011 మార్చిలో హైదరాబాద్ ట్యాంక్ బండ్ వద్ద మిలీనియం మార్చ్ పేరుతో పెద్ద ఎత్తున ఆందోళన జరిగింది. ఈ నిరసన కార్యక్రమం సమయంలో కొన్ని మీడియా వాహనాలు, కెమెరాలు, ఓబీ వ్యాన్లు ధ్వంసం అయ్యాయని ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనలపై పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు సమయంలో ఆ ఉద్యమంలో పాల్గొన్న నేతలపై కూడా ఆరోపణలు వచ్చాయి. ఈ కేసు దర్యాప్తులో భాగంగా కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులను నిందితులుగా చేర్చారు. ఈ కేసు రాజకీయంగా కూడా పెద్ద చర్చకు దారి తీసింది. అయితే, వీరు ప్రత్యక్షంగా ఘటనల్లో పాల్గొన్నారని చెప్పేందుకు తగిన ఆధారాలు లేవని వారి తరఫు న్యాయవాదులు వాదించారు.

కోర్టులో వాదనలు..: ఈ కేసులో న్యాయవాది రమణారావు వాదనలు వినిపిస్తూ, పిటిషనర్లకు ఈ ఘటనలతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. వారు ఆందోళనకు నాయకత్వం వహించినా, ఆస్తి నష్టం జరిగిన ఘటనలకు ప్రత్యక్ష బాధ్యత లేదని న్యాయస్థానానికి తెలిపారు. దీర్ఘకాల విచారణ అనంతరం, ఆయా ఆధారాలను హైకోర్టు పరిగణనలోకి తీసుకుంది. తాజా తీర్పులో, కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులపై నమోదైన కేసులను హైకోర్టు కొట్టివేసింది. ఈ కేసులో వారికి ఎలాంటి క్రిమినల్ బాధ్యత లేదని స్పష్టం చేసింది. ఈ తీర్పుతో వారికి చట్టపరంగా పెద్ద ఊరట లభించింది.

# తక్షణం ఆస్తిపన్ను చెల్లించండి

## ఐదు శాతం రాయితీకి మరో నాలుగు రోజుల గడువు

నల్లగొండ,ఏప్రిల్24 : నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్ను చెల్లింపుపై ప్రభుత్వం అందిస్తున్న 5 శాతం రాయితీ పొందేందుకు కేవలం 6 రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయని, ఈ అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బచ్చలకూరి శరత్ చంద్ర కోరారు.

శుక్రవారం మున్సిపల్ సమావేశ మందిరంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగర ప్రజలు తమ ప్రాపర్టీ పన్ను బకాయిలను పూర్తిగా చెల్లించి, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పన్నును తక్షణమే చెల్లించి, రాయితీ ప్రయోజనాన్ని పొందాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. పన్నులు సమయానికి చెల్లించడం ద్వారా నగర అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన ఆర్థిక వనరులు సమకూరుతాయన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, రహదారుల అభివృద్ధి, వీధి దీపాల నిర్వహణ, వర్షపు నీటి కాల్వల శుద్ధి, పర్యావరణ పరిరక్షణ వంటి ప్రాథమిక సేవలను మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి పన్నుల వసూలు కీలకమని తెలిపారు. పౌరులందరూ ప్రాపర్టీ ట్యాక్స్‌తో పాటు వాటర్ ట్యాక్స్ అలాగే ట్రేడ్ లైసెన్స్ ఫీజులు కూడా ఎలాంటి ఆలస్యం లేకుండా చెల్లించాల్సిందిగా కోరారు. ప్రజల సహకారం లేకుండా నగర అభివృద్ధి సాధ్యం కాదని, ప్రతి పౌరుడు బాధ్యతగా ముందుకు వచ్చి పన్నులు చెల్లించడం ద్వారా నల్లగొండను మరింత పరిశుభ్రమైన, అభివృద్ధి చెందిన నగరంగా తీర్చిదిద్దడంలో భాగస్వాములు కావాలని కోరారు. పౌరులందరూ చివరి తేదీకి ముందుగానే తమ పన్నులను చెల్లించి, ప్రభుత్వం అందిస్తున్న 5 శాతం రాయితీని వినియోగించుకోవడంతో పాటు, నగరాభివృద్ధికి తమ వంతు సహకారం అందించాల్సిందిగా కమిషనర్ కోరారు.

# ఆర్టీసీ జేఏసీ నేతలతో మంత్రుల బృందం భేటీ...

మొదటిపేజీ తరువాయి...

హైదరాబాద్: తెలంగాణలో ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మె మూడవ రోజుకు చేరుకుంది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన సచివాలయంలో ఆర్టీసీ జేఏసీ నేతలతో మంత్రుల బృందం భేటీ అయింది. ఈ సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, వివేక్, అడ్లూరి లక్ష్మణ్ పాల్గొన్నారు. ఈ భేటీకి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ప్రత్యేక సీఎస్ వికాస్ రాజ్ కూడా హాజరయ్యారు.వరంగల్ జిల్లా నర్సంపేట డిపోకు చెందిన డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి పట్ల మంత్రులు, జేఏసీ నేతలు సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని మంత్రులు భరోసా ఇచ్చారు. ఏ కార్మికుడు కూడా ఆవేశంతో అనాలోచిత నిర్ణయం తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలన్నింటిని తక్షణమే అమలు చేయాలని జేఏసీ నేతలు పట్టుబట్టారు. కార్మికులు లేవనెత్తిన 32 డిమాండ్లలో 29 అంశాలకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని మంత్రులు తెలిపారు. మిగిలిన మూడు అంశాలపై అధ్యయనం కోసం కొంత సమయం కావాలని అన్నారు. అయితే ఏయే డిమాండ్లు ఎప్పటిలోగా అమలు చేస్తారో లిఖితపూర్వక హామీ ఇవ్వాలని జేఏసీ నేతలు డిమాండ్ చేశారు.

శంకర్ గౌడ్ కుటుంబానికి రూ. 10 లక్షలు, ఉద్యోగం: ఆత్మహత్య చేసుకున్న డ్రైవర్ శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం రూ. 10 లక్షల పరిహారం ప్రకటించింది. స్థానిక ఆర్డీవో ఉమారాణి ఆయన మృతదేహానికి ఈరోజు నివాళులర్పించారు. అనంతరం ఈ ప్రకటన చేశారు. పరిహారంతో పాటు కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఆర్టీసీలో ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. మరోవైపు, నర్సంపేట కాంగ్రెస్ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి వ్యక్తిగతంగా రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు ప్రకటించారు.

# ఎమ్మెల్సీ అనంతబాబు అరెస్ట్

## కాకినాడ సర్పవరం పోలీస్ స్టేషన్‌కు తరలింపు

రాజమండ్రి,ఏప్రిల్24 : డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబును రాజమహేంద్రవరం కోర్టు ప్రాంగణంలో పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఆయనను అరెస్టు చేయడం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఈ కేసు మొదటి నుంచీ వివాదాస్పదంగానే కొనసాగుతోంది. తాజాగా బెయిల్ రద్దు పిటిషన్‌పై విచారణకు అనంతబాబు, ఆయన భార్య లక్ష్మీదుర్గ కోర్టుకు హాజరయ్యారు. ముఖ్యంగా కోర్టు నుంచి బయటకు వచ్చిన వెంటనే పోలీసులు అనంతబాబును అదుపులోకి తీసుకోవడం తీవ్ర చర్చకు దారి తీసింది. డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో ఇప్పటికే అనంతబాబు బెయిల్‌పై ఉన్న విషయం తెలిసిందే. అయితే, ఇటీవల ఆయన సాక్షులను బెదిరిస్తున్నారని ఆరోపణలు రావడంతో కోర్టులో బెయిల్ రద్దు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ విచారణ సందర్భంగా పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. ఆయనను అరెస్ట్ చేసే సమయంలో కోర్టు సముదాయం చుట్టూ పోలీసులు భారీగా మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. అరెస్టు అనంతరం అనంతబాబును కాకినాడలోని సర్పవరం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్కడ ఆయనపై తదుపరి విచారణ కొనసాగనుంది. ఈరోజు సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో అనంతబాబును స్టేషన్‌కు తీసుకెళ్లనున్నారు. అక్కడ ఆయనను విచారించి తదుపరి న్యాయ ప్రక్రియలు చేపట్టనున్నారు. ఈ కేసులో సాక్షులు భయపడేలా చేయడం లేదా కేసు నుంచి వెనక్కు తగ్గించేలా ఒత్తిడి తేవడం వంటి చర్యలు న్యాయపరంగా తీవ్రంగా ఉన్నాయి.

# కేరళను హారెత్తిస్తున్న ఎండలు

మొదటిపేజీ తరువాయి...



వడగాలుల హెచ్చరికల దృష్ట్యా, పాలక్కాడ్, కొల్లాం, త్రిస్సూర్ జిల్లాల్లో పండుగల సమయంలో పగటిపూట జరిగే ఏనుగుల ఊరేగింపులు, బాణాసంచా ప్రదర్శనలను నివారించాలని లేదా వాయిదా వేయాలని ఆయన ఆదేశించారు. అలాగే ప్రయాణికులకు, ప్రజలకు తాగునీటిని అందించడానికి నీటి ట్యాంకులను, నీడ ఉన్న విశ్రాంతి ప్రదేశాలను ఏర్పాటు చేయాలని స్థానిక సంస్థలు, కుటుంబశ్రీ విభాగాలు, స్వచ్ఛంద సంస్థలు, వ్యాపారులకు ఆయన విజ్ఞప్తి చేశారు. అలసట లేదా వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే, వెంటనే వైద్య సహాయం తీసుకోవాలని ఆయన సూచించారు. ఎండదెబ్బకు ఎవరైనా ఇబ్బంది పడుతున్నట్లు కనిపిస్తే వెంటనే వారిని నీడ ఉన్న ప్రదేశానికి తరలించి వైద్య సహాయం అందించాలని విజయన్ కోరారు..

# పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో విజయం బీజేపీదే

మొదటిపేజీ తరువాయి...

బెంగాల్ ఓటర్లు అభివృద్ధిని ఎంచుకున్నారని తొలి దశ ఎన్నికలతో స్పష్టమైందని చెప్పుకొచ్చారు. బెంగాల్‌లో మార్పు కోసం ప్రజలు ఉత్సాహంగా ఓట్లు వేశారన్నారు. మహిళల రక్షణ బీజేపీ మొదటి ప్రాధాన్యత అని పేర్కొన్నారు. అవినీతిపరులకు శిక్ష తప్పదని హెచ్చరించారు. బెంగాల్‌లో బీజేపీ, పార్టీ అభ్యర్థులు తమ అంచనాలకు తగినట్లుగా పని చేశారని కితాబిచ్చారు. మరోవైపు స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా పోలింగ్ ప్రక్రియను నిర్వహించారంటూ ఎన్నికల సంఘం, స్థానిక పోలీసులు, భద్రతా దళాలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. చాలా కాలం తర్వాత ఒక్కరి ప్రాణం కూడా పోకుండా జరిగిన బెంగాల్ ఎన్నికలు ఇవేనని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. కాగా, ఈనెల 23న పశ్చిమ బెంగాల్, తమిళనాడు అసెంబ్లీలకు ఎన్నికలు జరిగాయి. తమిళనాడులో 234 స్థానాలకు ఒకేసారి పోలింగ్ జరగ్గా.. పశ్చిమ బెంగాల్‌లో మాత్రం తొలి దశలో 152 స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. మిగిలిన 142 స్థానాలకు ఏప్రిల్ 29న పోలింగ్ జరగనుంది. మే 4న ఫలితాలు వెల్లడిస్తారు.

# ఆర్టీసీ సమ్మెకు బలయిన శంకర్‌గౌడ్

మొదటిపేజీ తరువాయి...

మరోవైపు.. ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ బలవన్మరణం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శంకర్ గౌడ్ కుటుంబానికి అండగా ఉంటామని, ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా ఆదుకుంటామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. శంకర్ గౌడ్ ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ధైర్యం, మనోబలం కలగాలని ప్రార్థించారు. క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయం ఆ కుటుంబాన్ని దు:ఖసాగరంలో ముంచిందని తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆర్టీసీ కార్మికులతో ప్రభుత్వం చర్చలు జరుపుతుందని, వారి సమస్యలను పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నాలు చేస్తుందని గుర్తు చేశారు. ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి పట్ల మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. శంకర్ గౌడ్ ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు. ఆర్టీసీ కార్మికులు ఆందోళన చెందవద్దని క్షణికావేశంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు.

# ఒప్పందం కుదరకపోతే దాడులే..

మొదటిపేజీ తరువాయి...

"మేం ఇప్పటికే 75 శాతం లక్ష్యాలను ఛేదించాం" అని చెబుతూ, ఇరాన్ నావిక, వాయు, క్షిపణి సామర్థ్యాలకు తీవ్ర నష్టం కలిగించామని వివరించారు. వ్యూహాత్మకంగా కీలకమైన హర్మూజ్ జలసంధిపై తమకు పూర్తి నియంత్రణ ఉందని, ఇరాన్‌పై ఆర్థిక ఒత్తిడి పెంచేందుకు దాన్ని మూసివేశామని తెలిపారు.

"మేం జలసంధిని తెరిస్తే, వారికి రోజుకు 500 మిలియన్ డాలర్ల ఆదాయం వస్తుంది. ఒప్పందం కుదిరే వరకు అలా జరగనివ్వను" అని ఆయన అన్నారు. ఈ వివాదం మొత్తం ఇరాన్ అణ్వస్త్రం చుట్టూనే తిరుగుతోందని ట్రంప్ స్పష్టం చేశారు. "వారు అణు బాంబును కలిగి ఉండటానికి వీల్లేదు. దాన్ని మేం జరగనివ్వం" అని అన్నారు. అదే సమయంలో అమెరికా మాత్రం అణ్వాయుధాలను ఉపయోగించదని హామీ ఇచ్చారు. "నేను దాన్ని వాడను. అణ్వాయుధాన్ని ఎవరూ ఉపయోగించకూడదు" అని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, అమెరికా విజ్ఞప్తి మేరకు ఇరాన్‌లో ఉరిశిక్ష ఎదుర్కొంటున్న ఎనిమిది మంది మహిళలను విడుదల చేయనున్నారని, ఇది తమ దౌత్యపరమైన విజయమని ఆయన సూచించారు.

# సంపాదకీయం

## భారత్ లో పెరుగుతున్న ఆటమ్నల్ రొమాన్స్

ఒకప్పుడు అరవై ఏళ్లు వచ్చాయంటే... ఆధ్యాత్మిక చింతన, మనవలు, మనవరాళ్లతో కాలక్షేపం, విశ్రాంతి జీవితం మాత్రమే గుర్తుకు వచ్చేది. కానీ ఆధునిక భారత వృద్ధతరం మాత్రం నాకొక గాల్ ఫ్రెండ్ కావాలిరా అంటూ పాడుకుంటున్నారు. యూత్‌తో పోటీ పడి మరీ డేటింగ్ యాప్‌ల్లో ఖాతాలు తెరుస్తున్నారు. ప్రేమ, తోడు కోసం సెకండ్ ఇన్నింగ్స్ కోసం అడుగులు వేస్తున్నారు. విదేశాల్లో సాధారణమైన ఆటమ్నల్ రొమాన్స్ అంటే మలి వయసు ప్రేమ ఇప్పుడు భారత్‌లో కూడా చాలా వేగంగా విస్తరిస్తోంది. ముంబై, ఢిల్లీ, కోల్‌కతా వంటి మెట్రో నగరాల్లో వృద్ధుల కోసం ప్రత్యేకంగా సింగిల్ మిక్సర్స్ నిర్వహిస్తున్నారు. ఇక్కడ వారు రిటైర్‌మెంట్ ప్లాన్లు, ఆరోగ్య విశేషాలు చర్చించుకుంటూనే తమకు నచ్చిన తోడును ఎంచుకుంటున్నారు. భారత్‌లో సగటు ఆయుర్దాయం 50 నుంచి 71 ఏళ్లకు పెరిగింది. అంటే రిటైర్‌మెంట్ తర్వాత కూడా సుమారు రెండు దశాబ్దాల జీవితం మిగిలే ఉంటోంది. పిల్లలు విదేశాల్లో లేదా ఇతర నగరాల్లో స్థిరపడటం వల్ల సుమారు 15 శాతం మంది వృద్ధులు నగరాల్లో ఒంటరిగా ఉంటున్నారు. ముఖ్యంగా కోవిడ్ తర్వాత ఒంటరిగా ఉండటం మానసిక ఆందోళనలు, డిప్రెషన్ వంటి సమస్యలు పెరుగుతున్నాయి. వీటిపై అవగాహన పెరిగింది. కేవలం శారీరక ఆకర్షణ కంటే, మనసు విప్పి మాట్లాడే ఒక తోడు ఉండాలనే కోరిక వారిని ఈ దిశగా నడిపిస్తోంది. “మేం కూడా సంతోషంగా ఉండటానికి అర్హులమే” అనే భావన ఇప్పుడు బలపడుతోంది. ప్రముఖ నటుడు ఆశిష్ విద్యార్థి 57 ఏళ్ల వయసులో రూపాలి బరువాను వివాహం చేసుకున్నారు. జీవితంలో ఏ దశలోనైనా తోడు అవసరమని, సంతోషంగా ఉండే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని ఆయన చెప్పుకొచ్చారు. వారిద్దరూ కలిసి ఫిఫ్టీ ప్లస్ జిందగీ అనే యూట్యూబ్ ఛానెల్ ద్వారా తమ ప్రయాణాన్ని పంచుకుంటున్నారు. బాలీవుడ్ నటి సుహాసిని ములే 60 ఏళ్ల వయసులో వివాహం చేసుకున్నారు. ఫేస్‌బుక్ ద్వారా పరిచయం అయిన ఒక శాస్త్రవేత్తను పెళ్లి చేసుకున్నారు. సమాజం ఒత్తిడి వల్ల కాకుండా, తనకు తోడు కావాలని అనిపించినప్పుడు మాత్రమే ఆమె ఈ నిర్ణయం తీసుకున్నారు. సెలబ్రిటీలే కాకుండా సామాన్యులు కూడా ఈ బాటలో ఉన్నారు. కేరళకు చెందిన గోకుల్ శ్రీధర్ అనే వ్యక్తి తన తల్లి పడుతున్న కష్టాలు చూసి పునర్వివాహం చేశాడు. ఇది 2013లో సంచలనంగా మారింది. కునాల్ అశోక అనే ఇద్దరు బాల్య స్నేహితులు సుమారు 35 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. అప్పటికే వారి భాగస్వాములను కోల్పోయారు. చివరకు 2023లో వాళ్ల 60వ ఏట వివాహ బంధంలోకి అడుగు పెట్టారు. టెక్నాలజీ కేవలం యువతకే కాదు, వృద్ధులకు కూడా వరంగా మారింది. నేడు భారతీయ వృద్ధులు ఉపయోగిస్తున్న టాప్ యాప్‌లు ఒకసారి పరిశీలిస్తే ఆసక్తికరంగా ఉంటుంది. 50 ప్లస్ క్లబ్‌ను కేవలం వీళ్ల కోసమే రూపొందించారు. ట్రూలీ మాడ్లీ ఏ యాప్ కూడా 50 ప్లస్ వాళ్లకు క్రియేట్ చేశారు. ఇందులో సబ్‌స్క్రిప్షన్‌లు కోవిడ్ తర్వాత భారీగా పెరిగింది. క్వాక్‌క్వాక్ అండ్ బాంబుల్ అనే యాప్ ప్రాంతీయ భాషల్లో సపోర్ట్ చేస్తుంది. అందుకే ఇందులో ఉండే వారి సంఖ్య చాలా ఎక్కువగా ఉంది. అయితే డేటింగ్ యాప్‌లలో పురుషులు ఎక్కువగా యూజ్ చేస్తున్నారు. మహిళలు నేరుగా మిక్చర్స్, సిర్ఫ్ కాఫీ వంటి వెరిఫైడ్ సర్వీస్‌లను ఇష్టపడుతున్నారువాడేంటో అప్పుడే బట్టతల వచ్చేసింది. ఇంత తొందరగా ముసలాడు అయిపోయాడు'' అని కామెంట్స్ చేస్తుంటారు. కొందరైతే మరీ దారుణంగా బాడీషేమింగ్ చేస్తారు. రియాల్టీ ఏంటంటే ప్రతి ఒక్కరూ లైఫ్‌లో ముసలోళ్లు అవుతారు. కానీ...అందరికీ ఈ వృద్ధాప్యం రెండు సార్లు వస్తుందట. ఇటీవల జరిగిన ఓ రీసెర్చ్‌లో ఇదే విషయం వెల్లడైంది. సాధారణంగా రిటైర్ అయ్యే ఏజ్ వస్తే అప్పుడు ముసలితనం వచ్చేసినట్టు భావిస్తుంటాం. కానీ...అంత కన్నా ముందు నుంచే మన శరీరంలోని కణాల్లో శక్తి తగ్గిపోతుంది. 25-75 ఏళ్ల మధ్యలో ఉన్న వాళ్ల శరీరాల్లోని కణాల పని తీరుని ట్రాక్ చేశారు. ఆ క్రమంలోనే చాలా మందిలో 44 ఏళ్ల నుంచే కణాల్లో వృద్ధాప్య ఛాయలు కనిపించడం మొదలైంది. 60 ఏళ్లకు పూర్తి స్థాయిలో వృద్ధాప్యం వచ్చేసిందని గుర్తించారు. అంటే దాదాపు రెండు సార్లు ముసలితనం వచ్చేసినట్టే లెక్క. ఇలా శరీరంలోని కణాల్లో శక్తి మెల్లగా తగ్గిపోవడాన్నిలైనర్ ఏజింగ్ గా చెబుతున్నారు పరిశోధకులు. సాధారణంగా 40 ఏళ్లు వచ్చాక మహిళల్లో మెనోపాజ్ ఆగిపోతుంది. అప్పటి నుంచే వాళ్లకు వృద్ధాప్యం వచ్చినట్టు పరిగణిస్తారు. అయితే...పురుషుల్లోనూ 40 ఏళ్లు దాటాక ఇదే పరిస్థితి వస్తున్నట్టు ఈ పరిశోధన వెల్లడించింది. 44 ఏళ్లకు ఎప్పుడైతే వృద్ధాప్యం మొదలవుతుందో అప్పటి నుంచి గుండె సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం పొంచి ఉంటుందని ఈ రీసెర్చ్ స్పష్టం చేసింది. మద్యం సేవించే వాళ్లకు ఈ ముప్పు మరింత ఎక్కువ. ఇదే వయసులో మిగతా వ్యాధులు వచ్చేందుకూ ఆస్కారముంటుంది. 40-59 మధ్య వయసున్న వాళ్లలో 40% మందికి హార్ట్ అటాక్‌లు వచ్చే అవకాశముందని వివరించింది. 60 ఏళ్లు దాటాక ఈ రిస్క్ 75% వరకూ పెరుగుతుందని తేల్చి చెప్పింది. సరిగ్గా ఇదే వయసులో పార్కిన్‌సన్, అల్జీమర్స్ లాంటి వ్యాధులూ అటాక్ చేసే ప్రమాదముంది. 40 ఏళ్లు దాటగానే కొందరిలో చర్మం ముడతలుబడిపోతుంది. అదే వృద్ధాప్యానికి సంకేతం. ఈ వయసులోనే మోకాళ్ల నొప్పులు మొదలవుతాయి. గాయాలైతే అవి మానడానికీ చాలా సమయం పడుతుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం..అంతర్జాతీయంగా 40 ఏళ్లకే వృద్ధాప్యం వస్తున్న దాఖలాలు పెరుగుతున్నాయి. పైగా ప్రపంచవ్యాప్తంగా వృద్ధుల సంఖ్య పెరుగుతోంది. 2019లో 60 ఏళ్లకు వృద్ధాప్యం వచ్చిన వాళ్ల సంఖ్య 100 కోట్లుగా ఉండగా 2030 నాటికి ఇది 140 కోట్లకి, 2050 నాటికి 200 కోట్లకు చేరుకుంటుందని అంచనా వేసింది.

# నిర్దేశించిన ఉపాధి హామీ లక్ష్యాలను చేరుకోవాలి

**ఉపాధి హామీ పని ప్రదేశంలో అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలి**

**జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**





జగిత్యాల (తెలంగాణ వాణి) జగిత్యాల జిల్లాలోని కథలాపూర్ మండల కేంద్రంలో ఉపాధి హామీ పథకం పనుల పురోగతిపై శుక్రవారం జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్య పెంపుపై ప్రత్యేకంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ... గ్రామాల్లో మరిన్ని కూలీలను ఉపాధి హామీ పనుల్లో భాగస్వామ్యం చేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో పనుల అందుబాటును పెంచాలని ఆదేశించారు. పనుల ఎంపికలో పారదర్శకత పాటించాలని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. పనుల ప్రగతిని రోజువారీగా పర్యవేక్షించాలన్నారు. కూలీల హాజరు నమోదు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. మస్టర్ రోల్స్ లో ఎటువంటి లోపాలు ఉండకూడదని స్పష్టం చేశారు. కూలీలకు సమయానికి వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పనుల తీరుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఉపాధి హామీ పనులలో మహిళలను భాగస్వామ్యం చేయాలని తెలిపారు. ప్రతి పనిని ఫోటో క్యాప్చరింగ్ ద్వారా ఎన్ఎంఎంఎస్ యాప్ లో నమోదు చేయాలన్నారు. జియో ట్యాగింగ్ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. లక్ష్యాలను నిర్ణీత కాలంలో పూర్తి చేయాలని,ఉపాధి హామీ పనుల్లో ఎటువంటి నిర్లక్ష్యం చేయకూడదని, అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని, గ్రామాల అభివృద్ధికి ఉపాధి హామీ పథకం కీలకమని పేర్కొన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని, ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రజల జీవనోపాధి మెరుగుపడుతుందని తెలిపారు. పనుల ప్రణాళికను ముందుగానే సిద్ధం చేయాలని, ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వేసవి కాలం అయినందున ఉపాధి హామీ పనులకు వచ్చే వారికి తగిన ఏర్పాట్లు చేయాలని, షేడ్ నెట్ లు తగిన నీడ, త్రాగు నీరు, ఓఆర్ఎస్, ప్రథమ చికిత్స, తదితర ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీఓ జీవాకర్ రెడ్డి, డిఆర్డిఓ రఘువరన్, తహసీల్దార్, ఎంపీడీఓ, ఏపిఓ లు, ఈసీ లు, టీఏ లు, కంప్యూటర్ ఆపరేటర్ లు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఈ రోల్ మ్యాపింగ్‌లో సహకరించండి

**ఓటర్లను కోరిన తహసీల్దార్**



చుంచుపల్లి (తెలంగాణ వాణి) : మండలంలో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ ) భారత్ ఎన్నికల సంఘం ద్వారా కార్యక్రమం అమలు జరుగుతోందని చుంచుపల్లి తహసీల్దార్ కూచిపూడి నాగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి బూత్ లెవల్ ఆఫీసర్ (బిఎల్ఓ) తమ పరిధిలోని ఓటర్ల వివరాలను సమగ్రంగా పరిశీలించి “ఈ-రోల్ మ్యాపింగ్” ప్రక్రియను తప్పనిసరిగా పూర్తి చేయాలని సూచించారు. ఈ ప్రక్రియలో భాగంగా 2002 ఓటరు జాబితాను ప్రామాణికంగా తీసుకుని ప్రతి ఓటరు వివరాలను నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. అలాగే, ప్రతి కుటుంబానికి సంబంధించిన సభ్యుల వివరాలను కుటుంబ మ్యాపింగ్ కింద నమోదు చేయడం కూడా ఈ కార్యక్రమంలో ముఖ్య భాగమని పేర్కొన్నారు.

ఈ నేపథ్యంలో మండలంలోని ప్రజలందరూ తమకు సంబంధించిన బిఎల్‌ఓలను సంప్రదించి తమ ఓటరు వివరాలు, కుటుంబ సభ్యుల వివరాలు సక్రమంగా నమోదు చేయించుకోవాలని తహసీల్దార్ కోరారు. ప్రతి ఓటరు ఈ ప్రక్రియలో చురుకుగా పాల్గొనడం ద్వారా భవిష్యత్ ఎన్నికల కోసం ఖచ్చితమైన ఓటరు జాబితా సిద్ధం కావడానికి సహకారం అందిస్తారని చెప్పారు. చుంచుపల్లి మండల పరిధిలోని 18 పంచాయతీలలో ఉన్న 41 పోలింగ్ స్టేషన్ల పరిధిలోని ఓటర్లు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, వార్డ్ సభ్యులు ఈ కార్యక్రమానికి పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. మండలంలోని ప్రతి ఓటరు ఈ రోల్ మ్యాపింగ్ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని అధికారులు పిలుపునిచ్చారు.

# శంకర్ గౌడ్ ది ప్రభుత్వ హత్యే



హుస్నాబాద్ (తెలంగాణ వాణి ఆర్ సి) ఆర్టీసీ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల కోసం దీక్ష చేపడుతున్న సమయంలో అద్దె బస్సులు నడపడానికి అధికారులు బయటకు పంపుతుండగా శంకర్ గౌడ్ కు ఆర్టీసీ అధికారులకు వాగ్వాదం జరగడంతో అధికారులు దూషించడం మూలంగానే శంకర్ గౌడ్ మనస్తాపం చెంది ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నారని సిద్దిపేట జిల్లా మోకు దెబ్బ జన హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యాంసుందర్ గౌడ్ అన్నారు. వారు మాట్లాడుతూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసుకోవడంతో పాటు అందులో పని చేస్తున్న కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. శంకర్ గౌడ్ ఆత్మ హత్యకు కారకులైన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగంతో పాటు కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రభుత్వం చెల్లించాలని, ఆర్టీసీ ప్రతినెల మహాలక్ష్మి పథకం కింద 300 కోట్ల రూపాయలు ఆర్టీసీకి చెల్లిస్తున్నందున సంస్థ లాభాల్లో నడుస్తుందని మంత్రులు డంక బజాయిస్తున్నారని, అలాంటప్పుడు పదవి విరమణ పొందిన కార్మికులకు వారికి రావాల్సిన బకాయిలు చెల్లించకుండా ఎందుకు తాత్సారం చేస్తున్నారని ప్రశ్నించారు. శంకర్ గౌడ్ కు న్యాయం జరిగే వరకు పోరాడుతామని హెచ్చరించారు.

# బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ పక్షాన అండగా ఉంటాం

**11వ వార్డ్ కౌన్సిలర్ పూదరి వరప్రసాద్**



హుస్నాబాద్ (తెలంగాణ వాణి ఆర్ సి) హుస్నాబాద్ పట్టణంలోని 11వ వార్డుకు చెందిన ఠాగూర్ తార బాయ్ అనారోగ్య కారణాలతో మృతి చెందగా వార్డు కౌన్సిలర్ పూదరి వరప్రసాద్ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్ పర్సన్ దండి లక్ష్మి కొమురయ్య, వైస్ చైర్మన్ చిత్తారి పద్మ రవీందర్ లు భౌతికకాయంను సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అనారోగ్య కారణాలతో ఇటీవలే మృతి చెందిన నెమలికొండ ఓదయ్య, నమిలికొండ సాంబమూర్తి, కుటుంబ సభ్యులనుపరామర్శించారు. బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ పక్షాన అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా పట్టణ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడం వల్ల అత్యవసర మైతే తప్ప ఎవరూ బయటికి రావద్దని తెలిపారు. మార్కెట్ లో రైతులు ధాన్యాన్ని ఉదయం ఆరబెట్టుకుని సాయంత్రం కుప్పగా దగ్గరికి చేసుకోవాలని సూచించారు. అధిక ఉష్ణోగ్రతను నమోదు అవుతున్న నేపథ్యంలో రైతులు ఉదయం లేదా సాయంత్రం వ్యవసాయ క్షేత్రం కు వెళ్లాలని మధ్యాహ్నం ఇంటి వద్దనే విశ్రాంతి తీసుకోవాలని తెలిపారు. పట్టణ వ్యాపారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా గ్రంథాలయం మాజీ చైర్మన్ కేడం లింగమూర్తి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బూరుగు కృష్ణస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శ ఫీల్డ్ అసిస్టెంట్‌కు జిల్లా కలెక్టర్ నగదు పురస్కారం

?పెద్దపల్లి (తెలంగాణ వాణి): కేంద్ర ప్రభుత్వం నూతనంగా ఉపాధి హామీ పనుల్లో పారదర్శకత కోసం ప్రవేశపెట్టిన ఫేస్ అథెంటికేషన్ యాప్ ద్వారా కూలీల హాజరును నమోదు చేయడంలో స్వప్న విశేష ప్రతిభ, పథకం అమల్లో భాగంగా పెద్దపల్లి జిల్లా ఓదెల మండలంలోని కొలనూర్ గ్రామం జిల్లాలోనే అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తోందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రసంశించారు. గత వారం రోజులుగా నిరంతరాయంగా రోజుకు గరిష్టంగా 194 మంది కూలీలతో పని చేయిస్తూ జిల్లాలోనే రికార్డు స్థాయిలో కూలీల హాజరును నమోదు చేస్తున్నందుకు గాను, ఆ గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ మిడి దొడ్డి స్వప్నను జిల్లా యంత్రాంగం అభినందించింది. ?ఈ మేరకు శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్రీ కోయ శ్రీ హర్ష స్వప్నకు 5,000 రూపాయల పురస్కారం అందించి సత్కరించారు. ?ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు ఉపాధి కల్పించడంలో కొలనూర్ గ్రామం ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. జిల్లాలోని ఇతర పంచాయతీ లు కూడా ఇదే స్ఫూర్తితో కూలీలకు గరిష్ట స్థాయిలో పని కల్పించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమం లో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కాళిందిని, అదనపు జిల్లా కార్యక్రమ సమన్వయ కర్త సత్యనారాయణ, ఇతర శాఖాధికారులు పాల్గొన్నారు.

# రైతు నేస్తం కాంగ్రెస్ ప్రభుత్వం



ఎల్లారెడ్డి (తెలంగాణ వాణి ప్రతినిధి) నియోజకవర్గం తాండూరు వద్ద కొనుగోలు కేంద్రంవద్ద రైతులతోఏఎంసీ చైర్మన్, మండల పార్టీ అధ్యక్షులు మీటింగ్ ఏర్పాటు చేశారు. లారీలు, జల్లెడ మిషన్, తరుగు, రైస్ మిల్లర్ లు, గన్ని బ్యాగులు గురించి వారు మాట్లాడుతు రైతులు అధైర్యపడవద్దని ఎమ్మెల్యే ద్రుష్టికి వీటి గురించి తెలిపి ధాన్యం తొందరగా అమ్ముడు పోయే విధంగా చూస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రామచంద్రారెడ్డి, దివిటి కృష్ణయ్య, వెంకట్రాంరెడ్డి, వాసిరెడ్డి సంజీవులు, సర్పంచ్ యాదవ్, వెంకట్ గౌడ్, సంగయ్య, నాయకులు రైతులు సొసైటీ సీఈవో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# ఉపాధి హామీ కూలీలు జాగ్రత్తలు పాటించాలి :సంగమేశ్వర్ పాటిల్



రాయికోడ్:ఏప్రిల్ 24(తెలంగాణ వాణి ప్రతినిధి): సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండల పరిధిలోని మహ్మదాపూర్ గ్రామంలో శుక్రవారం నాడు గ్రామ సర్పంచ్ అశ్విని సంగమేశ్వర్ పాటిల్ ఆధ్వర్యంలో గ్రామంలో ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రదేశానికి వెళ్లి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్ లను పంపిణి చేశారు. వారు మాట్లాడుతూ పెరుగుతున్న ఎండల దృష్ట్యా కూలీలు ఎండ వేడి పెరగక ముందే పనిని ఉదయం 6గంటల నుండి 10 గంటల వరకు సాయంత్రం 4-6వరకు పని చేయాలని, తలకు టవల్ కట్టుకొవాలని ఎక్కువగా నీటిని త్రాగలని దాని ద్వారా వడ దెబ్బ నుండి తప్పించుకోగలరని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీనివాస్,పంచాయతీ కార్యదర్శి సుజాత ,ఫీల్డ్ అసిస్టెంట్ అంజి, ఆశా వర్కర్ పద్మ మరియు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# జనగణన--2027 ప్రక్రియ విజయవంతంగా నిర్వహించాలి: జిల్లా కలెక్టర్



జగిత్యాల: ఏప్రిల్ 24 (తెలంగాణ వాణి ప్రతినిధి): రాబోయే జనగణన--2027 కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు ఎంపికైన ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లకు శనివారం కోరుట్ల పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ జనగణన ప్రక్రియ దేశ అభివృద్ధికి కీలకమని, ఖచ్చితమైన గణాంకాలు సేకరించడం ద్వారా ప్రభుత్వ పథకాల రూపకల్పన, అమలు సులభమవుతుందని తెలిపారు. ఎన్యూమరేటర్లు మరియు సూపర్వైజర్లు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. శిక్షణలో భాగంగా ఇంటింటి వివరాల సేకరణ విధానం, డిజిటల్ పద్ధతుల్లో డేటా నమోదు, ప్రజలతో వ్యవహరించే తీరు, గోప్యత పరిరక్షణ వంటి అంశాలపై వివరంగా అవగాహన కల్పించారు. అలాగే ఫీల్డ్‌లో ఎదురయ్యే సమస్యలు, వాటి పరిష్కారాలపై మార్గదర్శకాలు అందించారు. జిల్లాలో జనగణన ప్రక్రియను సమయానికి పూర్తి చేయాలని, ప్రతి ఇంటి సమాచారం సరిగ్గా నమోదు చేయాలని అధికారులందరికీ సూచించారు. ప్రజల సహకారం లేకుండా జనగణన సాధ్యం కాదని, అందువల్ల ప్రజలు కూడా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీవో జివాకర్ రెడ్డి, తహసిల్దార్లు, శిక్షకులు, ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లు సంబంధిత శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

# దేశం నుంచి పారిపోవడానికి..

# పదేండ్లుగా ప్రణాళిక!

## ఎట్టకేలకు ఉత్తర కొరియా నుంచి తప్పించుకున్న ఓ కుటుంబం



సియోల్: ఉత్తర కొరియా.. ఈ పేరు వింటేనే ఒక నియంత.. కఠిన నిబంధనలు, ఆంక్షలు.. అగ్రరాజ్యం అమెరికాను సైతం భయపెట్టేలా అప్పుడప్పుడు క్షిపణి ప్రయోగాలు మనకు గుర్తుకు వస్తుంటాయి. ఎన్నో కఠిన ఆంక్షలు ఉన్న ఆ దేశం నుంచి ఒక కుటుంబం విజయవంతంగా తప్పించుకున్న వైనాన్ని సీఎన్ఎన్ వెల్లడించింది. అయితే ఇది రాత్రికి రాత్రేమీ జరిగిపోలేదు. దాని కోసం ఆ కుటుంబం 10 ఏండ్ల పాటు వేసిన ప్రణాళికలు, దానిని అమలు చేసేందుకు పన్నిన పథకాలు ఏ హాలీవుడ్ సినిమాకు తీసిపోని విధంగా ఉన్నాయి. కిమ్ఇల్ హ్యోక్ అనే వ్యక్తి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లేని ఉత్తర కొరియా నుంచి తన కుటుంబంతో సహా పారిపోవాలని అనుకున్నాడు. దాని కోసం 10 ఏండ్లుగా ప్రణాళికలు వేస్తూ దశలవారీగా అమలు చేయడం ప్రారంభించాడు. సాధారణంగా దేశం నుంచి పారిపోయే వారు నదిని దాటి చైనాలోకి వెళ్లడానికి ప్రయత్నిస్తుంటారు. ఇది అత్యంత సాధారణ మార్గం. కానీ చైనాలో దొరికితే తిరిగి ఉత్తర కొరియాకు పంపే ప్రమాదం కూడా ఉంది. కానీ కొందరు కొరియన్ డీమిలిటరైజ్డ్ జోన్ (డీఎంజడ్) ద్వారా దక్షిణ కొరియా వెళ్లడానికి ప్రయత్నిస్తారు. సైన్యం, మైన్స్, గన్స్‌తో ఉండే ఇది చాలా ప్రమాదకరం. కిమ్ఇల్ హ్యోక్ ఈ మార్గాన్నే ఎంచుకున్నాడు. 2023 మేలో వారు అత్యవసరంగా దేశం నుంచి తప్పించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రకృతి కూడా సహకరించిందన్నట్టుగా, ఆ రోజు రాత్రి భారీ వర్షం కురవడం ప్రారంభించింది. దీంతో వారు ఆ వానలోనే ఒక చేపల పడవలో ప్రయాణం ప్రారంభించారు. ఒక గార్డుకు లంచం ఇచ్చి ఎల్లో సీలో చేపల వేటకు అనుమతి పొందారు. కిమ్ భార్య, అతని తల్లి, అతని వదిన, హ్యోక్ అత్త పడవలో గోనెసంచుల అడుగున కదలకుండా పడుకున్నారు. తర్వాత ఆ పడవ తీరం నుంచి దూరంగా వెళ్లిపోయింది. ఆ సమయంలో తమ గుండె పడవ ఇంజన్ కన్నా గట్టిగా కొట్టుకుందని కిమ్ తర్వాత పేర్కొన్నారు. సుమారు రెండు గంటల తర్వాత సముద్ర సరిహద్దు జలాల వద్దకు చేరుకున్నారు. అక్కడ కనుక ఉత్తర కొరియా పెట్రోలింగ్ సిబ్బందికి దొరికారో వారిని చంపడమో, జీవితాంతం జైలులో వేయడమో చేసేవారు. అయితే అదృష్టం వారివైపు ఉంది. మెల్లిగా వారి పడవ ఉత్తర పరిమితి రేఖను దాటింది. తర్వాత వారు దక్షిణ కొరియాలోని యెన్ప్యోంగ్ ద్వీపానికి చేరుకున్నారు. దక్షిణ కొరియా నావికా సిబ్బంది వారిని తొలుత అదుపులోకి తీసుకున్నారు. తర్వాత ఉత్తర కొరియా నుంచి వచ్చినట్టు నిర్ధారించుకుని ఆశ్రయం కల్పించారు.

# పామును పసిగట్టే పరికరం!

న్యూఢిల్లీ,: గ్రామీణ భారతంలో పాము కాటు మరణాలను నివారించే లక్ష్యంతో కిసాన్ మిత్ర ఛడీ అనే కొత్త ఎలక్ట్రానిక్ పరికరం అందుబాటులోకి వచ్చింది. వెలుగు తక్కువగా ఉండే ప్రాంతాల్లో తరుచూ పనిచేసే రైతులు పాముకాటుకు గురికావడం దేశంలో సర్వసాధారణంగా మారిపోయింది. గ్రామీణ భారతంలో ముఖ్యంగా వ్యవసాయ కూలీలు ఎక్కువ పనిచేసే ప్రదేశాల్లో పాముకాటు అనేది ముఖ్యమైన ప్రజారోగ్య సమస్యగా కొనసాగుతున్నది. కాగా తక్కువ ఖర్చుతో లభించే సాంకేతిక పరిష్కారాలు పాము కాటు ముప్పును తగ్గించి వ్యవసాయ పనుల్లో ఆరోగ్య భద్రతను మెరుగుపరచడానికి దోహదం చేస్తాయి. దాదాపు 5 నుంచి 15 మీటర్ల దూరంలో దాగి ఉన్న సర్పాన్ని కూడా వైబ్రేషన్ టెక్నాలజీతో పనిచేసే కిసాన్ మిత్ర ఛడీ అనే ఈ పరికరం కనిపెడుతుంది. 100 మీటర్ల దూరంలో ఏదైనా సర్పం ఉంటే వెంటనే గట్టి వైబ్రేషన్ ద్వారా రైతుకు సిగ్నల్ ఇస్తుంది. రాత్రుళ్లు పొలాల్లో పనిచేసే రైతులు, కూలీలు పాము కాట్లకు గురికాకుండా నివారించడమే ఈ పరికరం ప్రధాన ఉద్దేశం. కిసాన్ మిత్ర ఛడీ అనే ఈ ఎలక్ట్రానిక్ కర్రను భారతీయ శాస్త్రవేత్తలు రూపొందించారు. ఇది పాము కదలికలపై రైతులను ముందుగానే అప్రమత్తం చేస్తుంది. కేంద్ర వ్యవసాయ మంత్రి శివ్‌రాజ్ సింగ్ చౌహాన్ అధికారికంగా ఈ పరికరం పనితీరు గురించి వివరించారు. ముందుగా రైతు ఈ కర్రను నేలలో పాతి బటన్‌ని నొక్కాలి. వెంటనే పరిసరాల్లో



(100 మీటర్ల దూరం వరకు) కదలికలను ఈ కర్ర స్కాన్ చేస్తుంది. ఇన్‌ఫ్రారెడ్ రేడియేషన్ లేదా నిర్దిష్టమైన వైబ్రేషన్ ఫ్రీక్వెన్సీల ద్వారా పామును గుర్తిస్తుంది. పామును గుర్తించిన తర్వాత కర్ర గట్టిగా వైబ్రేట్ అవుతుంది. దీంతో రైతు పాముబారిన పడకుండా తప్పించుకోవచ్చు. ప్రమాదవశాత్తు పాము కాటుకు గురై ఏటా కొన్ని వేల మంది మరణిస్తున్న దృష్ట్యా ఈ మరణాల సంఖ్యను గణనీయంగా తగ్గించడానికి ఈ కర్ర ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. ఈ పరికరంలో ఉండే సెన్సార్లు పాము కదలికలు, దాని బుసను ఆధారం చేసుకుని రైతులను అప్రమత్తం చేయగలవని ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ సైంటిఫిక్ రిసెర్చ్ అండ్ ఇంజినీరింగ్ డెవలప్‌మెంట్ వివరించింది.

# అమెరికాను వీడుతాం..

## 40 శాతం మంది భారతీయుల అభిప్రాయమిదే



వాషింగ్టన్, : ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో అమెరికాకు వెళ్లిన ప్రవాస భారతీయుల కలలు క్రమంగా కనుమరుగవుతున్నాయి. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ పగ్గాలు చేపట్టింది మొదలు అక్కడి ప్రవాస భారతీయులకు కష్టాలు మొదలయ్యాయి. 40 శాతం మంది భారతీయ అమెరికన్లు ఆ దేశాన్ని వీడాలని భావిస్తున్నట్టు తాజా సర్వే ఒకటి వెల్లడించింది. అమెరికాలో భారత సంతతి ప్రజలు 52 లక్షల మంది నివసిస్తున్నారని గణాంకాలు చెబుతున్నాయి. వీళ్లందరిలో 'అమెరికా డ్రీమ్' కనుమరుగు అవుతున్నదని సర్వే అభిప్రాయపడింది. ఈ మార్పునకు ప్రధాన కారణం అమెరికాలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ వాతావరణమే. 'కార్నెగీ ఎండోమెంట్' తాజా సర్వేలో భాగంగా.. 1,000 మంది నుంచి సేకరించిన అభిప్రాయాలు విశ్లేషించగా, అమెరికాను వీడాలని తరచూ ఆలోచిస్తున్నామని 14 శాతం మంది, అప్పుడప్పుడు ఆలోచించామని 26 శాతం మంది చెప్పారు. ప్రతి పది మందిలో ఆరుగురు (58 శాతం) అమెరికా రాజకీయాలతో విసిగిపోయామని చెప్పగా, 41 శాతం మంది వ్యక్తిగత భద్రతపై ఆందోళనతో ఉన్నట్టు సర్వే పేర్కొన్నది.

ఆర్థిక ఒత్తిళ్లు.. జీవన వ్యయం: అమెరికా నగరాల్లో జీవన వ్యయం భరించలేనిదిగా మారిపోయింది. శాన్‌ఫ్రాన్సిస్కో, సియాటిల్, న్యూయార్క్ వంటి నగరాల్లో ఒక బెడ్‌రూమ్ అపార్ట్‌మెంట్‌కు నెల అద్దె 3,000 నుంచి 5,000 డాలర్ల వరకు ఉంటున్నది. ప్రధాన పట్టణ, టెక్ హబ్‌లలో కుటుంబ వ్యయం మధ్య తరగతికి చాలా భారంగా మారింది. మరోవైపు ద్రవ్యోల్బణం, ఉద్యోగ భద్రత ఆందోళన కలిగిస్తున్నది. భారత సంతతి పౌరుల్లో 71 శాతం మందికి ట్రంప్ సర్కార్ అనుసరిస్తున్న అమెరికా ఆర్థిక, వలస విధానాలు, అంతర్జాతీయ సంబంధాలు ఎంతమాత్రమూ నచ్చటం లేదు. 'అమెరికా అమెరికన్ల కోసమే' అన్న రాజకీయ విధానం, నినాదాన్ని నొక్కి చెప్పే ప్రసంగాలు భారతీయ అమెరికన్లను ఆందోళనకు గురిచేస్తున్నాయి. అమెరికాకు చెందిన వారిమనే భావన వారిలో తగ్గించిందని విశ్లేషకులు చెబుతున్నారు.

# ఆటో డెబిట్ చేయాలంటే 24 గంటల ముందే సమాచారం

ముంబై, : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్బీఐ) బ్యాంకింగ్ కస్టమర్ల కోసం మరికొన్ని కొత్త నిబంధనలను ప్రవేశపెట్టింది. ఇక నుంచి బ్యాంకులు ఎలా పడితే అలా మీ అకౌంట్ నుంచి మనీ ఆటోడెబిట్ చేసుకోవడానికి వీల్లేదు. కస్టమర్ల భద్రత కోసం ఆర్బీఐ కఠిన నిబంధనలు తీసుకొచ్చింది. ఇక నుంచి ఆటో డెబిట్ చేయాలంటే కస్టమర్‌కు తప్పనిసరిగా 24 గంటల ముందు ఎస్ఎంఎస్ లేదా ఈమెయిల్ ద్వారా సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. ఎంత కట్ చేస్తు?న్నారు..? దానికి గల కారణాన్ని తెలపాల్సి ఉంటుంది. ఓటీటీ సబ్‌స్క్రిప్షన్, ఇన్సూరెన్స్ ప్రీమియం, కారు లోన్ ఈఎంఐ, హోమ్ లోన్ వంటి వాటన్నింటికీ ఈ నిబంధన వర్తిస్తుంది. బ్యాంకు ముందస్తుగా సమాచారం ఇవ్వకుండా ఆటో డెబిట్ చేసుకుంటే కస్టమర్లు ఫిర్యాదు చేయవచ్చు.ఆటో డెబిట్ చేసుకోవాలనుకుంటే 24 గంటల ముందు బ్యాంకులు మీకు నోటిఫికేషన్ పంపుతాయి. దీని వల్ల ఈఎంఐకు అవసరమైన డబ్బులను మీరు అకౌంట్లో ఉంచుకుంటారు. దీని వల్ల మీరు లేట్ ఫీజులు చెల్లించాల్సిన అవసరం ఉండదు. ఇక ఒకవేళ ఆటో డెబిట్ తప్పు అని భావిస్తే మీరు బ్యాంక్ పంపించే నోటిఫికేషన్ ద్వారా రద్దు చేసుకోవచ్చు. బ్యాంకులు ఇక నుంచి ఇష్టానుసారం కస్టమర్‌కు ముందుగానే సమాచారం ఇవ్వకుండా డబ్బులు ఆటో డెబిట్ చేసుకోకూడదు. ముందుగా మీ అనుమతి, మీకు సమాచారం ఇచ్చాకే ఆటో డెబిట్ చేసుకోవాలి. ముందుగానే వచ్చే మెస్సేజ్ ద్వారా వివరాలు ఏదైనా తప్పు ఉంటే బ్యాంకును సంప్రదించవచ్చు. అమౌంట్ తప్పుగా ఉంటే సవరించుకోవచ్చుఒకవేళ 24 గంటల ముందే బ్యాంకులు మీకు ఆటో డెబిట్‌కు సంబంధించి సమాచారం ఇవ్వకపోతే ఫిర్యాదు చేయవచ్చు. ఇందుకోసం బ్యాంకింగ్ అంబుడ్స్‌మన్‌ను సంప్రదించి ఫిర్యాదు చేయవచ్చు. ఇక వినియోగదారుడి సమ్మతి లేకుండా ఒక్క రూపాయి కూడా బదిలీ చేసుకునే హక్కు బ్యాంకులకు లేదని ఆర్బీఐ స్పష్టం చేసింది. దీనికి సంబంధించి బ్యాంకులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అన్ని బ్యాంకులు దీనిని తప్పనిసరిగా పాటించాలని ఆర్బీఐ కొత్త నిబంధనల్లో పేర్కొంది. చాలామంది ఈఎంఐల గురించి మర్చిపోతారు. దీని వల్ల ఈఎంఐ సమయానికి అకౌంట్‌లో డబ్బులు లేకపోతే బ్యాంకులు బౌన్స్ ఛార్జీలు విధిస్తూ ఉంటాయి. ఇక నుంచి అలాంటి ఛార్జీలు మీకు ఉండవు. బ్యాంకులు ముందే సమాచారం ఇవ్వడం వల్ల మీ అకౌంట్లలో ఆ టైమ్‌కి డబ్బులు ఉంచుకుంటారు. బౌన్స్ ఛార్జీలను బ్యాంకులు భారీగా వసూలు చేస్తున్నాయి. దీనికి ఇప్పటినుంచి చెక్ పడనుందని చెప్పవచ్చు.

# డీలిమిటేషన్ అధికార కూటమికి బ్రహ్మాస్త్రం

విజయవాడ : డీలిమిటేషన్ దెబ్బ నుంచి తృటిలో వైసీపీ తప్పించుకుంది. పార్లమెంట్ లో ఈ నెల 17న ప్రవేశపెట్టిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు ఓటమి పాలు కావడం వైసీపీకి లోలోపల ఆనందాన్ని ఇచ్చింది అని అంటున్నారు. ఎందుకంటే ఈ బిల్లు కనుక సవ్యంగా పాస్ అయి ఉంటే ఏపీలో తొలి దెబ్బ వైసీపీకే పడేది అని అంటున్నారు. అధికారంలో కూటమి ప్రభుత్వం ఉంది. చంద్రబాబు సీఎం గా ఉన్నారు. ఆయన అపర చాణక్యంతో డీలిమిటేషన్ ప్రక్రియ జరిగింది అంటే వైసీపీ బలమంతా దూది పింజె మాదిరిగా ఎగిరిపోయేదని విశ్లేషణలు ఉన్నాయి. వైసీపీ బలం ఉన్న చోట్ వీక్ చేస్తూ ఆ పార్టీ పుట్టి ముంచగలిగే విధంగా ఈ డీలిమిటేషన్ అధికార కూటమికి ఒక బ్రహ్మాస్త్రంగా పనిచేసేది అని అంటున్నారు. ముఖ్యంగా రాయలసీమ వైసీపీకి హార్డ్ కోర్ రీజియన్. ఇక్కడ ఫ్యాన్ పార్టీ కకావికలు అయ్యే విధంగా కూటమి భారీ స్కెచ్ రూపొందించింది అన్న వార్తలు కూడా ఆ మధ్య వినిపించాయి. ఆఖరికి వైసీపీ అధినేత జగన్ సొంత నియోజకవర్గం పులివెందుల సైతం రెండు ముక్కలు అయ్యేదని వైసీపీ కుటుంబానికి యాభై ఏళ్ళుగా కంచుకోటగా ఉన్న ప్రాంతం పూర్తిగా కొత్త రూపు సంతరించుకుంటే జగన్ కి పోటీ



చేసేందుకు సైతం వేరే నియోజకవర్గం ఎంపిక చేసుకునే పరిస్థితి ఉండేదని కూడా చర్చ సాగింది. అంతే కాదు వైసీపీకి చెందిన దిగ్గజ నేతల స్థావరాలు సైతం డీలిమిటేషన్ ప్రక్రియలో కొట్టుకుని పోయేవని కూడా ప్రచారం సాగింది. అయితే డీలిటేషన్ ప్రక్రియ అన్నదే లేకుండా చివరిలో ఇండియా కూటమి యాంటీ చేసి గండి కొట్టింది. మహిళా బిల్లుని ప్రతిపక్షాలు అడ్డుకున్నాయని డీలిమిటేషన్ కాకుండా చేశారు అని జగన్ భారీ ట్వీట్ చేసి మరీ జాతీయ స్థాయిలో విపక్షాలను విమర్శించినా లోగుట్టు అయితే వైసీపీకి ఈ పరిణామం మహదానందం కలిగించింది అని అంటున్నారు. విపక్షం అంతా ఒక్కటిగా నిలిచి బిల్లుని ఓడించకపోతే ఈపాటికి దేశంలో విపక్షాల భయాలు సందేహాలు ఎలా ఉన్నా ఏపీలో మాత్రం వైసీపీకి అసలుకే ఎసరు వచ్చేసి ఉండేదని అంటున్నారు. దీంతో వైసీపీ నేతలు అంతా ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు అని అంటున్నారు. అయితే కేంద్రంలో మోడీ ప్రభుత్వానికి ఇంకా చేతిలో మూడేళ్ళ పాటు అధికారం ఉంది. దాంతో పాటుగా పట్టుదలకు మారు పేరు అయిన ఆయన మరో రూపంలో కనుక ఈ డీలిమిటేషన్ బిల్లు తీసుకుని వస్తే ఎలా అన్నదే చర్చగా ఉంది. అంతే కాకుండా ఏపీలో టీడీపీ కూటమి ప్రభుత్వంలో బీజేపీ ఉంది. కేంద్రంలో టీడీపీ మంత్రులు ఉన్నారు. కాబట్టి డీలిమిటేషన్ ప్రక్రియ జాతీయ స్థాయిలో నిలిచిపోయినా ఏపీ తెలంగాణా రాష్ట్రాల మేరకు అసెంబ్లీ సీట్ల పెంపుదలకు గట్టిగా పట్టుబట్టి ఒప్పించినట్లు అయితే ఆ రూపంలో అయినా సీట్లు పెరుగుతాయని అంటున్నారు. అదే జరిగితే పులి మీద పుట్ర అన్నట్లు మరో కొత్త ముప్పు వైసీపీకి పొంచి ఉన్నట్లే అని అంటున్నారు. ఏది ఏమైనా ప్రస్తుతానికి మాత్రం వైసీపీకి భారీ రిలాక్స్ అయితే వచ్చిందని అంటున్నారు. మరి ఇంతా చేసి ఎందుకు డీలిమిటేషన్ బిల్లుకు వైసీపీ మద్దతు ఇచ్చింది అంటే అక్కడే ఉంది రాజకీయ మతలబు అని అంటున్నారు. కేంద్రంలోని మోడీ సర్కార్ కి చెడ్డ కాకుండా అక్కడ ఓటేసినా మనసంతా డీలిమిటేషన్ బెంగతోనే నిండిపోయిందని అంటున్నారు. అలా వైసీపీ బెంగ పడిన వేళ కాగల కార్యాన్ని ఇండియా కూటమి తీర్చేసింది అని అంటున్నారు. మొత్తం మీద అయితే రాహుల్ గాంధీకి వైసీపీ థాంక్స్ చెప్పుకోవాలని సోషల్ మీడియా వేదికగా కామెంట్స్ పడుతున్నారు

### రైల్వే కోడూరు రోడ్డులో గాయాలతో కనిపించిన జింక.. తిరుపతికి తరలింపు

రైల్వే కోడూరు : రైల్వే కోడూరు పట్టణ పరిధిలో ఓ జింక తీవ్ర గాయాలతో రోడ్డుపై కనిపించిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. పట్టణంలోని ఎంజీ రోడ్డులో గాయాలపాలై నిస్సహాయ స్థితిలో పడి ఉన్న జింకను గమనించిన స్థానికులు వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. లారీ పైనుంచి కింద పడటం వల్లే జింకకు ఈ తీవ్ర గాయాలు అయి ఉంటాయని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సమాచారం అందుకున్న వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న ఫారెస్ట్ అధికారులు, గాయపడిన జింకను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం దానికి ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం, సంరక్షణ నిమిత్తం జింకను తిరుపతికి తరలిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు వెల్లడించారు. ఈ ఘటనపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, అధికారులు వచ్చేంత వరకు జింకను స్థానికులు నీరు తాపించి.. సురక్షితంగా చూసుకున్నారు.



# ఇక చైనాకు చుక్కలే

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24, : ప్రపంచ దృష్టి పశ్చిమాసియా యుద్ధం, శాంతి చర్చలపై ఉంది. దేశ ప్రజల దృష్టి ఐదు రాష్ట్రాల ఎన్నికలు, వాటి ఫలితాలపై ఉంది. ఈ సమయంలో కేంద్రం దేశ సరిహద్దులో మొదలు పెట్టిన ఓ పనిని పూర్తిచేసే దిశగా చర్యలు చేపట్టింది. లద్దాక్‌లో కీలక టన్నెల్ పనులను దాదాపు ముగించబోతోంది. బాల్ నుంచిమినామార్గ్ వరకు 13 కిలోమీటర్ల పొడవైన జోజులా పర్వతాన్ని తవ్వుతూ, రోజుకు 4 మీటర్ల వేగంతో పనులు జరుగుతున్నాయి. మే 30 నాటికి మిగిలిన 300 మీటర్లు పూర్తి చేయబోతున్నారు. దీనికి న్యూ ఆస్ట్రియన్ టన్నెలింగ్ పద్ధతి వాడుతున్నారు.అక్టోబర్ నుంచి ఏప్రిల్ వరకు జోజులా పాస్ మంచుతో కప్పిపోతూ, శ్రీనగర్ లద్దాక్ మార్గం మూసుకుపోతుంది. స్థానికులు ఆహారం, మందులు నిల్వ చేసుకుంటారు; సైన్యం ఇంటర్ కంటినెంట్ ప్లాన్లతో స్వయం సమృద్ధిగా ఉంటుంది. ఈ టన్నెల్ పూర్తయితే, 365 రోజులు వాహనాలు, భారీ ఆయుధాలు తరలింపునకు వీలవుతుంది. ప్రస్తుతం 29 కి.మీ./గం వేగం 70 కి.మీ./గం అవుతుంది. దూరం, ఖర్చు గణనీయంగా తగ్గుతాయి. 2018 నుంచి చైనా లద్దాక్ భూభాగాలను ఆక్రమించేందుకు ప్రయత్నిస్తోంది, భారత్ ధైర్యంగా తిప్పికొట్టింది. ఈ ప్రాజెక్ట్ చైనా-పాక్ సరిహద్దుల్లో సైనిక ఉద్దీపనను బలోపేతం చేస్తుంది. హిమాచల్ నుంచి దక్షిణ లద్దాక్‌కు ఆధార మార్గం (నిము పదుమ్ దార్చా) జోజులాను మరింత కీలకం చేస్తుంది. శింకు లా టన్నెల్ (4.1 కి.మీ., 15,800 అడుగుల ఎత్తు) కూడా హిమాచల్ లద్దాక్ కనెక్ట్‌ను లింక్ చేస్తుంది. ఈ ఇన్‌ఫ్రా పుష్ రక్షణ భద్రతను పెంచడమే కాక, వాణిజ్యం, పర్యాటకం, స్థానిక ఆర్థిక వ్యవస్థను ఉత్తేజపరుస్తుంది. బిలాస్పూర్-మనాలీ-లేహ్ రైలు (రూ.1.31 లక్షల కోట్లు), లేహ్ ఎయిర్‌పోర్ట్ టెర్మినల్ (రూ.640 కోట్లు)లతో కలిపి లద్దాక్ 'ట్సునామి ఆఫ్ డెవలప్‌మెంట్'కు సాక్షియైంది. రూ.20,660 కోట్లు రోడ్లకు కేటాయించారు. బీఆర్‌వో ప్రాజెక్ట్ విజయక్‌లో లేహ్?చాలుంకా, కార్గిల్ దుమ్గిల్ మార్గాలు మెరుగయ్యాయి.

# ఆర్టీసీ కార్మికుల సమ్మె పై ప్రభుత్వం మొండి వైఖరి వీడాలి

**డ్రైవర్ శంకర్ గౌడ్ కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్ గ్రేషియా చెల్లించాలి**

**ఆత్మహత్యలు వద్దు.. పోరాడి సాధించుకుందాం**

**సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు**

**కార్మికుల సమ్మెకు మద్దతుగా సిపిఐ ఆధ్వర్యంలో భారీ రాస్తారోకో**



హనుమకొండ : ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని,సమ్మె పై మొండి వైఖరి వీడాలని,ఈ విషయంలో సమ్మెపై ముఖ్యమంత్రి జోక్యం చేసుకోవాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శుక్రవారం నాడు హనుమకొండలోని కాళోజి సెంటర్ లో ఆర్టీసీ కార్మికుల సమస్యలపై ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో భారీ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం గతంలో ఇచ్చిన ఎన్నికల హామీ మేరకు ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో కార్మికుల పక్షాన నిలబడి పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆర్టీసీ కార్మిక, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మెకు సిపిఐ సంపూర్ణ మద్దతు ప్రకటించినట్లు తెలిపారు. ప్రభుత్వం గతంలో ఇచ్చిన ఎన్నికల హామీ మేరకు ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని కోరారు. ట్రేడ్ యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేసి గుర్తింపు సంఘం ఎన్నికలు జరపాలని డిమాండ్ చేశారు. ఆగిపోయిన రెండు వేతన సవరణలను తక్షణమే అమలు చేయాలని కోరారు. ఆర్టీసీ ప్రయాణికుల సౌకర్యార్థం కొత్త బస్సులను తక్షణమే కొనుగోలు చేయాలన్నారు. కార్మికుల ఐక్య పోరాటంతోనే హక్కుల సాధన సాధ్యం అని, సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలిపారు. ప్రైవేటు డ్రైవర్ల ప్రయోగం ప్రజల ప్రాణాలతో చెలగాటమేనని, సమ్మెను అణచివేసేందుకు ప్రయాణికుల ప్రాణాలను పణంగా పెడుతున్న ప్రభుత్వం వైఖరి మార్చుకోవాలని అన్నారు. ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం, ఉద్యోగ భద్రత, వేతన సవరణ, ఖాళీ పోస్టుల భర్తీ, కార్మికులకు సంబంధించిన సంక్షేమ చేశారు గత ఎన్నికల సందర్భంగా రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయాలని, ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, అదేవిధంగా ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్ గ్రెషియో ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఆర్టీసి కార్మికులు తమ సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గమని, ఆత్మహత్యలు పరిష్కారం కాదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ రాస్తారోకో కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, జిల్లా నాయకులు ఎన్ ఎ స్టాలిన్, వుట్కూరి రాములు, కర్రే లక్ష్మణ్, ఎదునూరి వెంకట్రాజం, కొట్టేపాక రవి, వేల్పుల సారంగపాణి, గుంటి రాజేందర్, అలువాల రాజు, పొనుగోటి రామ్ గోపాల్ చారి, పూజారి అమృతయ్య, కట్కూరి కృష్ణ, మామునూరి దామోదర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పిఠాపురం ఎపిసోడ్ లో కొత్త ట్విస్టులు



కాకినాడ, : ఏపీలో కూటమిలో భాగంగా పవన్ కల్యాణ్ కోసం సీటు త్యాగం చేసిన నేతగా పేరు తెచ్చుకున్న ఆయన..అప్పుడప్పుడు న్యూస్ ఇంట్రెస్టింగ్ సీన్స్‌కు తెరలేపుతున్నారట. జనసేనాని కోసం టికెట్ వదులుకోవడం వల్ల ఆయనకు ఓ రేంజ్‌లో ఎలివేషన్ వచ్చినా..ఆ తర్వాత పొలిటికల్ మైలేజ్ మాత్రం జీరో అన్నట్లు అయిపోందట. ఎమ్మెల్సీ అని..నామినేటెడ్ పోస్ట్ అని.. ఇలా ఎన్నో లీక్స్ వచ్చినా..ఇప్పటివరకు ఆయనకు ఏ పదవి దక్కలేదు. దీంతో అప్పుడప్పుడు ఆయనలోని అసంతృప్తిని క్యామియో రోల్‌లో చూపిస్తున్నారట.నిజానికి వర్మకు ఎలాంటి ప్రోటోకాల్ లేదు. పిఠాపురంలో జరిగే ప్రభుత్వ కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటున్నారు. అక్కడే ఏదో ఒక టాపిక్‌ను ఎత్తుకుని..ఇదేం పద్ధతి అంటూ అధికారులపై ఫైర్ అవుతున్నారు. ఇప్పటికే ఓసారి ఫ్లెక్సీలో చంద్రబాబు ఫోటోను చిన్నగా వేశారని అధికారులపై ఆయన సీరియస్ అవడం పొలిటికల్ హాట్ టాపిక్ అయింది. ఇప్పుడు మరోసారి పిఠాపురం అభివృద్ధి కమిటీ సమావేశంలో ఫ్లెక్సీలో సీఎం ఫోటో లేదంటూ రాద్ధాంతం చేశారు.అయితే ఇప్పటికి రెండుసార్లు సీఎం చంద్రబాబు ఫోటో కోసమే

## రంగంలోకి దొరబాబు..

వర్మ గళం వినిపిస్తున్నట్లు పైకి ప్రచారం జరుగుతున్నా ఆయన మాటల వెనుక మర్మమేంటన్నది ఎవరికి అంతుచిక్కట్లేదట. సీటు త్యాగం చేసినా..తనకు ఏ పదవి రాలేదనే ఫ్రస్ట్రేషన్‌లో ఉన్న వర్మ..తన అసంతృప్తిని మరో రూపంలో బయటపెడుతున్నారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. కక్కలేక మింగలేక అన్నట్లుగా తన ఆవేదనను నిరసనగా మార్చేస్తున్నారన్న టాక్ నడుస్తోంది.ఇక వర్మ బాధ ఒకటి అయితే..జనసేన నేత, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు కథ మరోలా ఉందట. 2004లోనే ఆయన ఫస్ట్ టైమ్ ఎమ్మెల్యే. ఆ తర్వాత 2019లో వైసీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. అప్పట్లో జగన్ దగ్గర ఆయన మాట బాగా చెల్లుబాటయ్యేదన్న టాక్ ఉంది. ఆ తర్వాత 2019లో వంగా గీతకు వైసీపీకి టికెట్ ఇవ్వగా.. ఆమె గెలుపు కోసం పనిచేసినా విజయం దక్కలేదు. 2024 ఆగస్టులో పెండెం దొరబాబు జనసేనలో చేరిపోయారు. ఆయన కూడా టూ టైమ్స్ ఎమ్మెల్యే, పైగా సీనియర్ లీడర్..ఈ నేపథ్యంలో తనకు కూడా ఏ పదవి లేకపోవడం ఆయన మదిని తొలిచేస్తుందట. అందుకే వర్మకేనా ఎలివేషన్..పిఠాపురంలో తాను కూడా ఉన్నానంటూ ఇది దొరబాబు సవాల్ అంటూ రెచ్చిపోతున్నారట. ఈ క్రమంలోనే ఏకంగా వర్మను టార్గెట్ చేసి పవన్ మదిలో చోటు కోసం ఆరాట పడుతున్నారటదొరబాబు పిఠాపురంలో వైసీపీ కోవర్టు అని వర్మ అంటుంటే..వర్మ చీకటి బాగోతాలు అంటూ దొరబాబు రచ్చకు తెరలేపారట. అయితే ఈ ఇద్దరిది సీరియస్ ఫైట్ కాదని..ఏదో ఒక బెర్త్ కోసమే రచ్చ చేస్తున్నారని పిఠాపురం పబ్లిక్‌లో చర్చ జరుగుతోందట. వర్మ త్యాగానికి ఏదో ఒక పదవి దక్కితే బాగుండనే చర్చ అందరిలో ఉన్నా..దొరబాబు ఎపిసోడ్‌పై జనంలో డిఫరెంట్ ఒపీనియన్స్ వ్యక్తం అవుతున్నాయట.రాజకీయ నాయకులు ఏదీ డైరెక్ట్ గా చెప్పరు. తన మీద ఒక్క అవినీతి అక్రమాల ఆరోపణలు రుజువు చేసినా రాజకీయ సన్యాసం స్వీకరిస్తాను అని దొరబాబు మీడియా ఎదుట సవాల్ చేశారు. తన మీద ఆరోపణలు చేసిన వారు నిరూపించాలని ఆయన డిమాండ్ చేశారు. పిఠాపురంలో ఒక్క విషయంలో కూడా తాను అవినీతి చేయలేందని ఆయన అన్నారు. తనది మచ్చ లేని జీవితం అన్నారు. తాను నిజానికి రాజకీయాల నుంచి తప్పుకోవాలనే అనుకున్నానని అయితే పవన్ కళ్యాణ్ మీద అభిమానంతో జనసేనలో చేరాను అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేనను మంచి మెజారిటీతో గెలిపిస్తామని ఆయన చెప్పారు. అంతే కాదు వర్మ అండ్ కో చేస్తున్న ఆరోపణల మీద తాను పూర్తి వివరణ ఇస్తాను అని అదే విధంగా వారి విషయంలో కూడా పూర్తి గుట్టు విప్పుతాను అని స్పష్టం చేశారు. అయితే ఒకే పార్టీలో ఉంటూ ఒకరి గుట్టు మరొకరు విప్పుకుంటామని చెప్పడంతో కూటమిలో అలజడి రేగుతోంది. వర్మ అయితే దొరబాబు స్కాములను బయట పెడతామని అంటున్నారు. ఆయనకు జనసేనతో సంబంధం లేదని కేవలం తాను చేసిన అవినీతిని కప్పుపుచ్చుకోవడానికే ఆ పార్టీలో చేరారు అని వర్మ విమర్శించారు. అదే విధంగా వర్మ గుట్టు తన దగ్గర ఉందని దొరబాబు అంటున్నారు. ఇలా ఇద్దరూ మీడియాకు ఎక్కడంతో పార్టీ పెద్దలు తలలు పట్టుకుంటున్నారు. ఈ విధంగా కీలక నేతలు మాజీ ఎమ్మెల్యేలు వీధిన పడితే పోయేది కూటమి పరువే అని అంటున్నారు.పొలిటికల్ లీడర్ల మాటల వెనుక మర్మం వేరులే అన్న ఒపీనియన్ ఉందనే ఉంది. ఇప్పుడు ఈ ఇద్దరి నేతల విమర్శలు, ప్రతి విమర్శల వెనుక పకడ్బందీ స్కెచ్ ఉందట. బాబు మదిలో చోటును పదిలం చేసుకునే ప్రయత్నంలో వర్మ..జనసేనాని మెప్పుకోసం దొరబాబు..రాజకీయాన్ని రక్తి కట్టిస్తున్నారట. ఇలా ఆ ఇద్దరి అసంతృప్తికి, ఆవేదనకు కారణం వేరైనా..కంటెంట్ మాత్రం బాగుందన్న డిస్కషన్ నడుస్తోంది.

## రాజమండ్రి కోర్టు వద్ద ఉత్కంఠ

**ఎమ్మెల్సీ అనంతబాబు అరెస్ట్**

**కాకినాడ సర్పవరం పోలీస్ స్టేషన్‌కు తరలింపు**

రాజమండ్రి, : డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబును రాజమహేంద్రవరం కోర్టు ప్రాంగణంలో పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఆయనను అరెస్టు చేయడం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఈ కేసు మొదటి నుంచీ వివాదాస్పదంగానే కొనసాగుతోంది. తాజాగా బెయిల్ రద్దు పిటిషన్‌పై విచారణకు అనంతబాబు, ఆయన భార్య లక్ష్మీదుర్గ కోర్టుకు హాజరయ్యారు. ముఖ్యంగా కోర్టు నుంచి బయటకు వచ్చిన వెంటనే పోలీసులు అనంతబాబును అదుపులోకి తీసుకోవడం తీవ్ర చర్చకు దారి తీసింది. డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో ఇప్పటికే అనంతబాబు బెయిల్‌పై ఉన్న విషయం తెలిసిందే. అయితే, ఇటీవల ఆయన సాక్షులను బెదిరిస్తున్నారని ఆరోపణలు రావడంతో కోర్టులో బెయిల్ రద్దు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ విచారణ సందర్భంగా పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. ఆయనను అరెస్ట్ చేసే సమయంలో కోర్టు సముదాయం చుట్టూ పోలీసులు భారీగా మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. అరెస్టు అనంతరం అనంతబాబును కాకినాడలోని సర్పవరం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్కడ ఆయనపై తదుపరి విచారణ కొనసాగనుంది. ఈరోజు సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో అనంతబాబును స్టేషన్‌కు తీసుకెళ్లనున్నారు. అక్కడ ఆయనను విచారించి తదుపరి న్యాయ ప్రక్రియలు చేపట్టనున్నారు. ఈ కేసులో సాక్షులు భయపడేలా చేయడం లేదా కేసు నుంచి వెనక్కు తగ్గించేలా ఒత్తిడి తేవడం వంటి చర్యలు న్యాయపరంగా తీవ్రంగా ఉన్నాయి. అందుకే ఈ ఆరోపణలు నిజమని తేలితే, అనంతబాబుపై కేసు మరింత బలపడే అవకాశం ఉంది. ప్రస్తుతం అనంతబాబు అరెస్టుతో కేసు మరో మలుపు తిరిగినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. బెయిల్ రద్దు పిటిషన్‌పై కోర్టు తీసుకునే నిర్ణయం, సాక్షుల వాంగ్మూలాలు, పోలీసుల దర్యాప్తు కలిసి ఈ కేసు తుది తీర్పును నిర్ణయించనున్నాయి. ఈ కేసు ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకుని పోలీసులు మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. ఈ కేసులో తదుపరి పరిణామాలు ఎలా ఉంటాయో, కోర్టు ఎలాంటి తీర్పు ఇస్తుందనే విషయం ఉత్కంఠగా మారింది.

## నియోజకవర్గానికి 22 ధాన్యం కొనుగోలు కేంద్రాల మంజూరు

**రైతుల సంక్షేమమే ధ్యేయంగా రికార్డు స్థాయిలో కొనుగోలు కేంద్రాల ఏర్పాటు**

**ధాన్యం విక్రయాల్లో రైతులకు తప్పనున్న రవాణా ఇబ్బందులు**

**దళారుల బెడద లేకుండా నేరుగా మద్దతు ధర పొందే అవకాశం**

**అన్నదాతల ముంగిటకే చేరువైన ధాన్యం సేకరణ వ్యవస్థ**

**వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసే దిశగా ముందడుగు**

**కేంద్రాలు సత్వరమే ప్రారంభించాలని అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే కూనంనేని**




కొత్తగూడెం (తెలంగాణ వాణి): కొత్తగూడెం నియోజకవర్గానికి రికార్డు స్థాయిలో 22 ధాన్యం కొనుగోలు కేంద్రాలు మంజూరయ్యాయని, ఇది నియోజకవర్గ రైతాంగానికి ఎంతో శుభపరిణామమని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల మంజూరుపై అయన హర్షం వ్యక్తం చేస్తూ..గత ప్రభుత్వాల హయాంలో మండలానికి కేవలం ఒకటి, రెండు కేంద్రాలు మాత్రమే ఉండేవని, కానీ తమ ప్రత్యేక కృషితో ఈసారి ఏకంగా 22 కేంద్రాలను మంజూరు చేయించడం జరిగిందని, సుజాతనగర్ మండలానికి 4 కేంద్రాలు, చుంచుపల్లి మండలానికి 4 కేంద్రాలు, లక్ష్మీదేవిపల్లి మండలానికి 5 కేంద్రాలు, పాల్వంచ మండలానికి 9 కేంద్రాలు ఏర్పాటు కానున్నాయని వివరించారు. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, పంటను సుదూర ప్రాంతాలకు తీసుకెళ్లే అవసరం లేకుండా గ్రామాల సమీపంలోనే కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. తద్వారా రైతులకు రవాణా ఖర్చులు తగ్గడమే కాకుండా, దళారుల ప్రమేయం లేకుండా మద్దతు ధర నేరుగా వారి ఖాతాల్లోనే జమ అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యధిక సంఖ్యలో కేంద్రాలు రావడం వల్ల ధాన్యం సేకరణ ప్రక్రియ వేగవంతం అవుతుందని, ఎక్కడా జాప్యం జరగకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేశామని పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, నియోజకవర్గ అభివృద్ధికి, రైతుల మేలుకు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు, సంబంధిత అధికారులు యుద్ధప్రాతిపదికన కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు అందుబాటులోకి తేవాలని ఆదేశించారు.

## దేవినేని ఉమాకు పదవి ఫిక్స్...



విజయవాడ, : తెలుగుదేశంకూటమి అధికారంలోకి వచ్చి దాదాపు రెండేళ్లు అవుతోంది. కానీ పార్టీ కోసం పనిచేసి, సీట్లు త్యాగం చేసిన నేతలకు మాత్రం ఇంతవరకు న్యాయం జరగలేదు. అటువంటివారు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. ముఖ్యంగా మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. తన విషయంలో నాయకత్వం సరైన రీతిలో వ్యవహరించడం లేదని ఆయన తన అనుచరుల వద్ద బాధపడుతున్నారు. ఈ విషయంలో ఒకరిద్దరు నేతలు కలుగజేసుకొని నాయకత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు ప్రచారం సాగుతోంది. దీంతో స్వయంగా సీఎం చంద్రబాబు రంగంలోకి దిగి దేవినేని ఉమామహేశ్వరరావు ను పిలిపించుకున్నట్లు తెలుస్తోంది. ఎమ్మెల్సీలతో పాటు రాజ్యసభ సభ్యుల ఎంపిక సమయంలో తన పేరు వినిపిస్తుందని.. తరువాత పట్టించుకునే వారు కరువవుతున్నారని.. పార్టీ కోసం త్యాగం చేస్తే తనకు కనీస గుర్తింపు లేకుండా పోతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. అయితే చంద్రబాబు దేవినేని ఉమామహేశ్వరరావుకు గట్టి హామీ ఇచ్చినట్లు పొలిటికల్ వర్గాల్లో ఒక టాక్ నడుస్తోంది.దేవినేని ఉమామహేశ్వరరావు తెలుగుదేశం పార్టీలో సీనియర్ మోస్ట్ లీడర్. చంద్రబాబుతో పాటు లోకేష్ కు అత్యంత సన్నిహితుడు కూడా. అటువంటి నాయకుడు వారు చెప్పడంతో టికెట్ త్యాగం చేశారు. మొన్నటి ఎన్నికల్లో పోటీ చేసే ఛాన్స్ వదులుకున్నారు. అయితే అధికారంలోకి వచ్చిన మరుక్షణం కీలక పదవి ఇస్తామన్న హామీ రెండేళ్లు అవుతున్న కార్యరూపం దాల్చడం లేదు. అయితే తప్పకుండా తనకు న్యాయం చేస్తారని ఎప్పటికప్పుడు సముదాయించుకుంటూ వస్తున్నారు దేవినేని ఉమామహేశ్వరరావు. జూన్లో నలుగురు రాజ్యసభ సభ్యులు పదవీ విరమణ చేస్తారు. అందులో టిడిపికి చెందిన ఒక్క పదవిని పాత నేతకు కొనసాగిస్తారు. ఉన్న ఒక్క పదవి కోసం చాలా పోటీ ఉంది. రకరకాల పేర్లు వినిపిస్తున్న తరుణంలో దేవినేని ఉమామహేశ్వరరావు తన బాధను సీనియర్ల వద్ద వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. వారిచ్చిన సమాచారంతో చంద్రబాబు దేవినేని ఉమా తో ప్రత్యేకంగా భేటీ అయినట్లు సమాచారం.1998లో తన సోదరుడు దేవినేని వెంకటరమణ అకాల మృతితో టీడీపీ బరిలో దిగారు దేవినేని ఉమామహేశ్వరరావు. ఆ ఎన్నికల్లో గెలిచిన ఆయన.. వరుసగా గెలుస్తూ వచ్చారు. తొలుతా నందిగామ నుంచి పోటీ చేసిన ఆయన నియోజకవర్గాల పునర్విభజనతో ఆ నియోజకవర్గము కనుమరుగయింది. 2014లో మైలవరం నుంచి పోటీ చేసి గెలిచిన ఉమాకు మంత్రిగా ఛాన్స్ ఇచ్చారు చంద్రబాబు. ఒకవైపు మంత్రిగా ఉంటూనే తెలుగుదేశం పార్టీ వాయిస్ను బలంగా వినిపించారు. 2019 ఎన్నికల్లో ఓడిపోయిన ఆయన పార్టీ బలోపేతానికి విశేషంగా కృషి చేస్తూ వచ్చారు. 2024 ఎన్నికల్లో మాత్రం చివరి నిమిషంలో వైసీపీ నుంచి వచ్చిన వసంత కృష్ణ ప్రసాద్ కోసం టికెట్ వదులుకున్నారు. అయితే ఒక బలమైన నేత త్యాగానికి ఫలితం లేకుండా పోయిందన్న ఆవేదన దేవినేని ఉమామహేష్ లో కనిపిస్తోంది.వాస్తవానికి చంద్రబాబుతో పాటు లోకేష్ కు అత్యంత సన్నిహితుడు దేవినేని ఉమామహేశ్వరరావు. ఆయనకు టికెట్ దక్కలేదంటే అందరూ ఆశ్చర్యపోయారు. కానీ వారిద్దరూ సముదాయించడంతోనే ఆ టికెట్ వదులుకున్నారు. తనకంటే జూనియర్లకు జిల్లాలో పదవులు లభిస్తే.. తాను మాత్రం రెండేళ్ల పాటు పవర్ పాలిటిక్స్ కు దూరంగా ఉండి పోవాల్సి వచ్చిందన్న ఆవేదన ఆయనలో ఉంది. అయితే చంద్రబాబు మాత్రం ఈసారి బలమైన హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. తప్పకుండా దేవినేని ఉమామహేశ్వరరావుకు పదవి అని అనుచరులు చెబుతున్నారు. చూడాలి మరి ఏం జరుగుతుందో.

## సమ్మె రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు

**ఆర్టిసి కార్మికుల న్యాయమైన సమ్మెకు మాజీ మంత్రి సంఘీభావం**



వనపర్తి : ఏప్రిల్ 24, (తెలంగాణ వాణి ప్రతినిధి ): ఆర్టిసి కార్మికులు చేస్తున్న మూడవ రోజు సమ్మెకు మాజీ మంత్రి తమ సంపూర్ణ మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా రవాణా వ్యవస్థ రూపకల్పన చేసింది నిజాం నవాబు అని అనాటి నుండి ఆర్టిసి కి వేల కోట్ల ఆస్తులు కలిగి ఆర్టిసి సంస్థ ఎదిగిందని అన్నారు.అటువంటి ఆర్టిసి సంస్థ కె.సి.ఆర్ హయాములో ఆర్టిసి కార్మికుల సంక్షేమం కోసం ఆస్తుల పరిరక్షణ కోసం ప్రభుత్వం కృషి చేసిందని తెలిపారు. ఆర్టిసి సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయడానికి చట్టాన్ని రూపొందించి గవర్నర్ అనుమతి కోసం పంపడం జరిగింది అని నాటి గవర్నర్ కాలయాపన వల్ల సాధ్యం కాలేదని వివరించారు. వేతన సవరణ 44శాతం అందించింది కూడా కె.సి.ఆర్ ని కొనియాడారు. ప్రజాస్వామ్యంలో సమస్యల పరిష్కారం కోసం పోరాడడం మన ప్రాథమిక హక్కు అటువంటి ప్రాథమిక హక్కును కూడా నేటి ప్రభుత్వం ఉక్కుపాదంతో అణగ తొక్కడాన్ని తీవ్రంగా ఖండించారు.ఆర్టిసి కార్మికులు గతములో సమ్మె చేస్తే మేము అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వంలో సంస్థను విలీనం చేస్తామన్న రేవంత్ రెడ్డి మాట నిలుపుకొని వెంటనే ఆర్టిసి కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో ఆర్టిసి కార్మికుల ఆందోళనకు సంపూర్ణంగా అండగా ఉంటూ పోరాటం చేస్తామని నిరంజన్ రెడ్డి హెచ్చరించారు. నిరంజన్ రెడ్డి, జె.ఏ.సి కన్వీనర్ విశ్వనాథం,బొబ్బిలి.ప్రేమ్ కుమార్,పెద్దముక్కుల. రవి, చలపతిరెడ్డి, బి.ఎస్.నారాయణ, గోకం . భాస్కర్, నాయకులు గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, నందిమల్ల.అశోక్,శ్రీకర్ గౌడ్, ప్రేమ్ నాథ్ రెడ్డి, సూర్యవంశం.గిరి, జోహెబ్ హుస్సేన్ హేమంత్ ముదిరాజ్, చిట్యాల. రాము,మంద. రాము, అస్లాం తదితరులు ఉన్నారు.

### ఆర్టీసీ కార్మికులకు మద్దతు ప్రకటించిన టీజీఈజేఏసీ

హైదరాబాద్ బ్యూరో : ఆర్టీసీ కార్మికుల తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నిర్వహిస్తున్న సమ్మెకు 206 సంఘాలతో కూడిన తాము సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని టీజీఈజేఏసీ ప్రకటించింది. ఈ మేరకు శుక్రవారం నాంపల్లి లోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో టీజీఈజేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావులు మాట్లాడుతూ ప్రజా రవాణా విషయంలో ఏర్పడుతున్న ఇబ్బందుల నేపథ్యంలో ఆర్టీసీ కార్మికుల సమస్యల విషయంలో ప్రభుత్వం వెంటనే చొరవ చూపి, చర్చలు జరిపి పరిష్కరించాలని కోరారు. గత ఆరు సంవత్సరాలుగా వారికి వేతన సవరణ జరగకపోవడం బాధాకరమని, వారు కోరుతున్న ఇతర డిమాండ్లు కూడా న్యాయపరమైనవేనని అన్నారు. వరంగల్ జిల్లా నర్సంపేట డిపోకు చెందిన కోలా శంకర్ గౌడ్ సమస్యల పరిష్కారం కోసం ఆత్మహత్యకు పాల్పడడం పట్ల వారు విచారం వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబానికి యావత్ ఉద్యోగుల పక్షాన ప్రగాడ సానుభూతి తెలుపుతున్నామన్నారు. ఆర్టీసీ కార్మికులెవరు కూడా ఎలాంటి ఆందోళనకు గురి కావద్దని, టీజీఈజేఏసీలోని సుమారు 15.35 లక్షల మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల మద్దతు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నేతలు ముజీబ్ హుసేనీ, బీ శ్యాం, పీ దామోదర్ రెడ్డి, కస్తూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు తెలిసేలా..

# వాస్తవాలను ప్రచురించాలి

**జిల్లా కలెక్టర్ జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ కుమార్ దీపక్**

మంచిర్యాల (తెలంగాణ వాణి) మీడియా సంస్థలు ప్రజలందరికీ వాస్తవాలు తెలిసేలా వార్తలు ప్రచురించాలని జిల్లా కలెక్టర్ జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా పౌర సంబంధాల అధికారి జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ కన్వీనర్ మాదంశెట్టి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమిటీ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దినపత్రికలు న్యూస్ చానళ్లు ప్రజలకు వాస్తవాలను తెలియజేయాలని తెలిపారు. 2026-28 సంవత్సరాలకు గాను ప్రభుత్వ ఉత్తర్వులు 252 ఆర్.టి. 103 ప్రకారం అర్హత గల వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు జారీ చేయడంలో కమిటీ ప్రభుత్వ ఉత్తర్వుల మార్గదర్శకాలను పాటించాలని తెలిపారు. సరైన గుర్తింపు అర్హత లేనివారు పాత్రికేయులుగా చలామణి కావడంతో అసలైన పాత్రికేయులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని కమిటీ సభ్యులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

అక్రిడిటేషన్ కోసం ఆన్ లైన్ లో అందిన దరఖాస్తులను కమిటీ సభ్యులు క్షుణ్ణంగా పరిశీలించి అర్హత గల వారిని ఎంపిక చేయాలని



తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు అల్లువెల్లి రమేష్ రెడ్డి గొల్లపల్లి సిద్ధార్థ పార్వతి సురేష్ కుమార్ దేగ సత్యనారాయణ మొహమ్మద్ ఇమాద్ ఉద్దీన్ రూపిరెడ్డి ప్రకాష్ రెడ్డి అయినంపూడి నవీన్ కుమార్ గొల్లన నరేష్ బెక్కం సదానందం మొదంపురం సంతోష్ జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయ సిబ్బంది కొల్లూరి సంపత్ కుమార్ జి.రవితేజ మంత్రి సునీల్ కుమార్ పాల్గొన్నారు..

# రైతు సమాచారంలో ఆశించిన స్థాయికి చేరని డిజిటల్ సేవలు..!



## సన్నిహిత సమాచారం పైనే అన్నదాత విశ్వాసం..!

పంట ఉత్పాదకత పెరగడంలో, సాగు నిర్ణయాల్లో, స్థిరమైన వ్యవసాయ విధానాల అమలులో వ్యవసాయ సమాచారం కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, పాడి రైతులు ఇప్పటికీ ఎక్కువగా సాంప్రదాయ సమాచార వనరులపై ఆధారపడుతున్నారు. ఇటీవల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జరిగిన ఒక అధ్యయనంలో పలు ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి. వరి ఎగుమతి ప్రాంతాల్లో నిర్వహించిన పరిశోధనలో ఈ అంశాలువెలుగులోకి వచ్చాయి.వాతావరణ మార్పులు, పురుగు నియంత్రణ, ఎరువుల వినియోగం, నీటి నిర్వహణ, మార్కెట్ ధరల వంటి కీలక విషయాల్లో రైతులు కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఇరుగు పొరుగువారు వంటి వ్యక్తిగత వనరులపై ఎక్కువగా ఆధారపడుతున్నట్లు తేలింది. శాస్త్రీయ వ్యవసాయ సమాచార వనరులు, డిజిటల్ ప్లాట్‌ఫార్మ్‌ల వినియోగం ఇంకా ఆశించిన స్థాయికి చేరలేదని అధ్యయనం స్పష్టం చేసింది.

**కుటుంబమే ప్రధాన సమాచారం వనరు..:** తెలంగాణలో 65 శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 68.75 శాతం రైతులు కుటుంబ సభ్యులు, స్నేహితుల నుంచే వ్యవసాయ సమాచారాన్ని ఎక్కువగా పొందుతున్నట్లు తేలింది. పొరుగువారి నుంచి సమాచారం పొందే శాతం కూడా గణనీయంగా ఉంది. అయితే ఈ విధానం వల్ల ఆధునిక "గుడ్ అగ్రికల్చరల్ ప్రాక్టీసెస్ (GAP)" గురించి అవగాహన తగ్గే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. గ్రామీణ సహకార వ్యవస్థ బలంగా ఉన్నప్పటికీ, సమాచారం తరతరాలుగా పరిమిత వర్గాల్లోనే కొనసాగుతుందని అధ్యయనం పేర్కొంది.

**ప్రభుత్వ వ్యవసాయ అధికారులపై అధిక విశ్వాసం..:** సాంప్రదాయేతర వర్గాల్లో రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులపై రైతుల విశ్వాసం అత్యధికంగాఉన్నట్లుతేలింది.తెలంగాణలో 71.25శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 73.75శాతం రైతులు వీరి ద్వారా సమాచారం పొందుతున్నారు. తెలంగాణలో రైతు వేదికల ద్వారా, ఆంధ్రప్రదేశ్‌లో రైతు భరోసా కేంద్రాల (RBKs) ద్వారా వ్యవసాయ సలహాలు చేరుతున్నప్పటికీ, కొన్ని గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా పూర్తి స్థాయి చేరిక లేనట్లు గుర్తించారు. శాస్త్రవేత్తలు, ICAR సంస్థలతో రైతుల ప్రత్యక్ష సంబంధం తక్కువగా ఉండడం కూడా ఒక ప్రధాన లోటుగా పరిశోధన పేర్కొంది. ఎన్జీవోల పాత్ర కూడా పరిమితంగానే ఉంది.

**మీడియా వినియోగంలో మార్పులు.. మొబైల్ పై ఆసక్తి... :** మాస్ మీడియా వర్గంలో కిసాన్ మేళాలు, వ్యవసాయ ప్రదర్శనలు రైతులకు ప్రధాన సమాచార వేదికలుగా నిలుస్తున్నాయి. ప్రత్యక్షంగా నేర్చుకునే అవకాశం ఉండటంతో రైతులు వీటికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. న్యూస్‌పేపర్లు మోస్తరు స్థాయిలో వినియోగంలో ఉండగా, మొబైల్/ఇంటర్నెట్ ఆధారిత సేవలు పెరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఈ డిజిటల్ వినియోగం కొంత ఎక్కువగా కనిపిస్తోంది. టీవీ వినియోగం పరిమితంగాఉండగా, రేడియోపూర్తిగా దాదాపువినియోగంలో లేకపోవడం గమనార్హం. ఇది సమాచార వినియోగంలో డిజిటల్ మరియు విజువల్ మీడియావైపు రైతులుమళ్లుతున్నసంకేతంగా కనబడుతోంది.

**మొత్తం వినియోగ ధోరణి..:** అధ్యయనంలో పాల్గొన్న రైతుల్లో ఎక్కువ మంది (సుమారు61.88శాతం) మధ్యస్థస్థాయి సమాచార వినియోగాన్ని చూపినట్లు తేలింది. తక్కువ స్థాయి వినియోగం 21.87 శాతం ఉండగా, అధిక స్థాయి వినియోగం 16.25 శాతంగా నమోదైంది.

**నిపుణుల అభిప్రాయం.. :** వ్యవసాయ సమాచార వ్యవస్థలో ప్రభుత్వ విస్తరణ సేవలు కీలకంగా ఉన్నప్పటికీ, పరిశోధనా సంస్థలు--రైతుల మధ్య దూరం తగ్గించాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. డిజిటల్ సేవలు, మొబైల్ యాప్స్ మరింత విస్తృతంగా చేరితే మాత్రమే ఆధునిక వ్యవసాయ పద్ధతుల స్వీకరణ పెరుగుతుందని అభిప్రాయపడుతున్నారు. పరిశోధన ప్రకారం, రైతులు ఇప్పటికీ కుటుంబం, స్నేహితులు వంటి సాంప్రదాయ వనరులపైనే ఎక్కువగా ఆధారపడుతున్నప్పటికీ, ప్రభుత్వ వ్యవసాయ సేవలు మరియు డిజిటల్ ప్లాట్‌ఫార్మ్‌ల వైపు నెమ్మదిగా మార్పు కనిపిస్తోంది. అయితే ఈ మార్పు వేగం ఇంకా పెరగాల్సిన అవసరం ఉందని అధ్యయనం స్పష్టం చేసింది.

ఉదయ్ కుమార్. జి
DAE, BA, BCJ, MCJ, LLB, MPhil., PhD
సీనియర్ జర్నలిస్టు
ఫోన్ నెంబర్ 8367603197

## ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి

**మరణించిన ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ కుటుంబాన్ని ఆదుకోవాలి**
**మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి**



కొత్తగూడెం (తెలంగాణ వాణి) తెలంగాణ ఆర్టీసీ కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కొత్తగూడెం మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కొత్తగూడెం ఆర్టీసీ డిపో ఎదుట ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మెకు మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు తెలిపింది. ఈ నిరసనలో సీతాలక్ష్మి మాట్లాడుతు ఆర్టీసీ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి సమ్మె నోటీసులు ఇస్తే స్పందించలేదని వ్యాఖ్యానించారు. తద్వారా వారు సమ్మె ప్రారంభించగా నర్సంపేట ఆర్టీసీ డిపో డ్రైవర్ శంకర్ గౌడ్ పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఆందోళన వ్యక్తం చేశారు. సమ్మె నోటీసులతో ప్రభుత్వం స్పందించి ఉంటే ఓ నిండు ప్రాణం పోయేది కాదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఆర్టీసీ కార్మికులతో చర్చలు జరిపి వారి సమస్యలకు పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే హక్కుల సాధన కోసం అమరుడైన శంకర్ గౌడ్ కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

## అధికారికంగా వాసవి మాత జయంతి ఆర్యవైశ్యులకు గర్వకారణం



**సీఎం,మంత్రి, చైర్మన్ లకు పాలభిషేకం చేసిన ఆర్యవైశ్యులు**
**తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి కొత్త శ్రీనివాస్ గుప్తా**

మక్తల్: ఏప్రిల్ 24(తెలంగాణ వాణి ప్రతినిది):తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మాత జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించేందుకు నిర్ణయం తీసుకొని ఉత్తర్వులు జారీ చేయడం ఆర్యవైశ్యులందరికి గర్వకారణం అని తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం మక్తల్ చైర్మన్ కొత్త శ్రీనివాస్ గుప్తా అన్నారు.వాసవి జయంతిని అధికారికంగా నిర్వహించేందుకు నిర్ణయం తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర పశుసంవర్ధక క్రీడల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి తో పాటు రాష్ట్ర మంత్రివర్గానికి, ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాతకు ఆర్యవైశ్యుల పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ అలాగే గాంధీ విగ్రహానికి పూలమాల వేసి అనంతరం సీఎం రేవంత్ రెడ్డికి,మంత్రి వాకిటి శ్రీహరికి,ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాతకు ఆర్యవైశ్య నాయకులు పాలభిషేకం చేశారు.శుక్రవారం నారాయణ పేట జిల్లా మక్తల్ పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరిస్తూ అమ్మవారి జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించేందుకు నిర్ణయం తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆర్యవైశ్యులంతా ప్రభుత్వానికి రుణపడి ఉంటామని అన్నారు. ప్రజలందరితో మమేకమై సేవా కార్యక్రమాలలో ముందుండే ఆర్యవైశ్యుల పట్ల పాలక ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరించడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో ఆర్యవైశ్య సంఘం,మహిళ సంఘము,వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు.ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్పర్సన్ కల్వ సుజాత ఆర్యవైశ్యుల తరపున చేసిన విజ్ఞప్తికి ముఖ్యమంత్రి ,మంత్రిమండలి సానుకూలంగా నిర్ణయం తీసుకోవడం హర్షనీయమని కొత్త శ్రీనివాస్ గుప్తా పేర్కొన్నారు. మరోమారు ఆయన రాష్ట్ర ముఖ్యమంత్రికి, మంత్రిమండలికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు మాజీ ఉపసర్పంచ్ కట్ట సురేష్ కుమార్ గుప్తా మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్పర్సన్ కల్వ సుజాత ఆధ్వర్యంలో ఎల్ బి స్టేడియంలో నిర్వహించిన వాసవి మాత పారాయణం గిన్నిస్ బుక్ రికార్డు నమోదు చేసుకుందన్నారు . ఈ సందర్భంగా ఆర్యవైశ్యుల విజ్ఞప్తిని మన్నించిన ముఖ్యమంత్రి వాసవి మాత జయంతికి నాలుగు రోజుల ముందే అధికారికంగా వాసవి మాత జయంతి వేడుకలను నిర్వహిస్తూ నిర్ణయం తీసుకొని ఉత్తర్వులు జారీ చేయడం పట్ల ఆర్యవైశ్య సమాజం ప్రభుత్వ నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేస్తుందని అన్నారు. ఆర్యవైశ్యులంతా రాష్ట్ర ముఖ్యమంత్రి కి రుణపడి ఉంటామని ఆయన పేర్కొన్నారు .ఈనెల 26న వాసవి మాత జయంతి సందర్భంగా మక్తల్ పట్టణంలోని శ్రీ పడమటి ఆంజనేయ స్వామి వారి పుష్కరిణి (కోనేరు) నుండి 108 కళాశాలతో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం వరకు శోభాయాత్ర,అభిషేకం, సామూహిక కుంకుమార్చన, అమ్మవారికి ఒడి బియ్యం, అన్నదానం మిగిత కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.ఈ వేడుకల్లో ఆర్యవైశ్యులు ,హిందూ బంధువులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు, పట్టణ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. వాసవి జయంతిని అధికారికంగా నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నాం ముఖ్యమంత్రి, మంత్రులకు కట్ట సురేష్ కుమార్ గుప్తా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో ఆర్యవైశ్య సంఘం పెద్దలు మనసాని వెంకటేష్ గుప్తా బిలకంటి జగదీష్ దొంత నరహరి,మనసాని నాగరాజు, కల్వ శ్రీనివాస్ ఉదయ్, బిలకంటి నరసయ్య ,వాసవి క్లబ్ అధ్యక్షులు మేడిశెట్టి హరికృష్ణ ,వనిత క్లబ్ అధ్యక్షురాలు కల్వాల ప్రసన్న మహిళ సంఘము మజీ అధ్యక్షులు మనసాని సరళ దేవి, పాలుట్ల సుష్మ, చల్ల రూప,తదితరులు పాల్గొన్నారు.

## శంకర్‌గౌడ్ మృతి అత్యంత బాధాకరం

**శవరాజకీయం చేస్తున్న బండి సంజయ్**
**మండిపడ్డ అద్దంకి దయాకర్**



హైదరాబాద్, ఏప్రిల్24 : ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ మృతి అత్యంత బాధాకరమని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ అన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ శవ రాజకీయాలు చేస్తున్నారని దయాకర్ మండిపడ్డారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. శంకర్ మృతిని కేంద్ర మంత్రి బండి సంజయ్ రాజకీయం చేస్తున్న తీరు హేయం, సిగ్గుచేటు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ వైపు బీఆర్ఎస్ నాయకులు కార్మికులను రెచ్చగొడుతుంటే.. మరోవైపు బీజేపీ నాయకులు శవరాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. నర్సంపేటలో ఉద్రిక్తతలకు కారణం బండి సంజయ్ అని వ్యాఖ్యానించారు. కేంద్ర మంత్రి అన్న విషయాన్ని మర్చిపోయి బండి సంజయ్ కార్మికులను రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గతంలో ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తే బీఆర్ఎస్ ప్రభుత్వం ఎలా స్పందించిందో అందరికీ తెలుసన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ స్వయంగా శంకర్ గౌడ్ కుటుంబాన్ని కలిసి ఆదుకుంటామని హామీ ఇచ్చారన్నారు. శంకర్ గౌడ్ కుటుంబం పట్ల ప్రభుత్వం సానుభూతితో ఉందన్నారు. ఆర్టీసీ కార్మికులతో ప్రభుత్వం చర్చలు జరుపుతోందని, చనిపోయిన ఆర్టీసీ కార్మికుడి కుటుంబానికి అండగా ఉంటామని సర్కార్ ప్రకటించిందన్నారు. సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే... బీజేపీ చిల్లర రాజకీయాలు చేస్తోందని ప్రభుత్వ విప్ మండిపడ్డారు. సీఎం, మంత్రివర్గం అంతా.. ఆర్టీసీ కార్మికులు తొందరపడవద్దని విజ్ఞప్తి చేశారన్నారు. సమస్య పరిష్కారానికి తాము ప్రయత్నిస్తుంటే.. బండి సంజయ్, బీఆర్ఎస్ నేతలు మాత్రం ఓట్లు వెతుక్కుంటున్నారని విమర్శించారు. దయచేసి ఆర్టీసీ కార్మికులు ఇలాంటి క్షుద్ర రాజకీయ పార్టీలను, నాయకులను నమ్మొద్దని.. కచ్చితంగా కార్మికుల కు ప్రభుత్వం అండగా ఉంటుందని అద్దంకి దయాకర్ స్పష్టం చేశారు.

## స్వీయ గణన ద్వారా జనగణన వేగవంతం: జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల (తెలంగాణ వాణి) జనగణన 2027లో భాగంగా స్వీయ గణన ప్రక్రియ నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. జన గణనను రెండు విడతలుగా నిర్వహించడం జరుగుతుందని మొదటి విడతలో మే 11వ తేదీ నుండి జూన్ 9వ తేదీ వరకు ఇండ్ల గణన రెండవ విడతలో జనగణన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు డిజిటల్ సాంకేతికతను ఉపయోగించి నాణ్యమైన స్పష్టమైన జాబితా రూపొందించడం జరుగుతుందని ఇందు కొరకు ఎన్యుమరేటర్లు సూపర్వైజర్లకు తగు శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. స్వీయ గణన కార్యక్రమం నిర్వహణలో ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ ఉద్యోగులు ప్రముఖ వ్యక్తులు గణన అధికారులు యువత స్వయం సహాయక సంఘాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించడం జరుగుతుందని ఈ నెల 26వ తేదీ నుండి మే 10వ తేదీ వరకు స్వీయ గణన పోర్టల్ అందుబాటులో ఉంటుందని జిల్లాస్థాయి జనగణన అధికారులు ప్రతిరోజు స్వీయ గణన వివరాలను నవీకరించాలని తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాలు గ్రామపంచాయతీలు మున్సిపల్ కార్పొరేషన్ మున్సిపాలిటీలలో స్వీయ గణనపై ప్రజలందరికీ తెలిసే విధంగా విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. జిల్లా అధికారులు మున్సిపల్ కమిషనర్లు స్వీయ గణన కార్యక్రమ కార్యచరణను పకడ్బందీగా అమలు చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాల అమలు జనాభా ప్రాతిపదికన చేపట్టడం జరుగుతుందని ఈ క్రమంలో స్పష్టమైన జాబితా రూపొందించేందుకు జిల్లా ప్రజలు సహకరించాలని తెలిపారు. ఈ నెల 26వ తేదీ నుండి మే 10వ తేదీ వరకు ఆన్ లైన్ లో https://sc.census.gov.in వెబ్ సైట్ ద్వారా స్వీయ గణన చేసుకోవచ్చని జనగణలో భాగంగా అధికారులు ఇంటికి వచ్చినప్పుడు స్వీయ గణన ఐ.డి. అందించవచ్చని తెలిపారు. జన గణన కొరకు అధికారులు వచ్చిన సమయంలో ప్రజలు వాస్తవ సమాచారాన్ని అందించాలని దినపత్రికలు లోకల్ కేబుల్ చానళ్లు వాట్సాప్ గ్రూపులు సోషల్ మీడియా కార్యాలయాలను ప్రదర్శన ద్వారా ప్రజలందరికీ తెలిసేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు.

## హ్యూమన్ ట్రాఫికింగ్‌పై ప్రజల్లో అవగాహన

**సోషల్ మీడియా ద్వారా యువత టార్గెట్**
**మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ**

విజయవాడ, : ఆంధ్రప్రదేశ్‌లో మనుషుల అక్రమ రవాణా పై అవగాహన పెంచేందుకు ఏపీ మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ కీలక కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో శైలజ నేతృత్వంలో రైల్వే పోలీసులతో కలిసి విజయవాడలో శుక్రవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించడం ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. ఈ కార్యక్రమం ద్వారా ట్రాఫికింగ్‌పై ప్రజల్లో అవగాహన పెంపుతో పాటు, గుర్తింపు విధానాలపై కూడా వివరణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైల్వే డివిజనల్ అధికారులతో కలిసి పనిచేస్తున్నామని, ముఖ్యంగా యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ అంశంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు రాయపాటి శైలజ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తమిళనాడుకు చెందిన పీఎం నాయక్ హాజరయ్యారని పేర్కొన్నారు. ట్రాఫికింగ్ అంటే.. ఒకే రకమైన నేరం కాదని, ఇది అనేక రూపాల్లో జరుగుతుందని రాయపాటి శైలజ వ్యాఖ్యానించారు. విద్యార్థులను విదేశాలకు పంపిస్తామని చెప్పి మోసం చేస్తున్నారని తెలిపారు. పలు మార్గాల్లో ట్రాఫికింగ్ జరుగుతుంతోందని వెల్లడించారు. ముఖ్యంగా, బాధితులను గుర్తించడం అత్యంత కీలకమని స్పష్టం చేశారు. ప్రస్తుతం ట్రాఫికింగ్ మాఫియా తమ విధానాలను మార్చుకుంటున్నాయని, సోషల్ మీడియా ద్వారా కూడా యువతను టార్గెట్ చేస్తున్నాయని తెలిపారు. ముఖ్యంగా బీటెక్ చదువుతున్న విద్యార్థులను విదేశాలకు తీసుకెళ్లి, వారిని సైబర్ నేరాల్లో పాల్గొనేలా చేస్తున్నారన్నారు. ఇది సాధారణంగా కనిపించని కొత్త రకం ట్రాఫికింగ్ అని, దీనిపై ప్రత్యేక అవగాహన అవసరమని తెలిపారు. ట్రాఫికింగ్ బాధితులను గుర్తించడం మాత్రమే కాకుండా, వారిని సైకలాజికల్‌గా ఎలా డీల్ చేయాలో కూడా ఈ కార్యక్రమంలో వివరించామని రాయపాటి శైలజ పేర్కొన్నారు. బాధితులు మానసికంగా చాలా ఒత్తిడిలో ఉంటారని, అందుకే వారికి సహాయం చేయాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులను గుర్తించేందుకు టెక్నాలజీని కూడా ఉపయోగిస్తున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా విశాఖపట్నంలో రోబోటిక్ సిస్టమ్ ద్వారా అనుమానాస్పద వ్యక్తులను గుర్తించే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇది భవిష్యత్తులో ట్రాఫికింగ్‌ను అరికట్టడంలో కీలక పాత్ర పోషించవచ్చని అభిప్రాయపడ్డారు. కేవలం పోలీసులు మాత్రమే కాదు, ప్రతి ఒక్కరూ కూడా బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. తెలియని వ్యక్తులతో జాగ్రత్తగా వ్యవహరించాలని.. సోషల్ మీడియాలో అపరిచితులతో సంబంధాల విషయంలో చాలా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఇలా ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉంటే ట్రాఫికింగ్‌ను తగ్గించవచ్చని చెప్పారు.

# సినిమా

## యాక్షన్ మోడ్‌లో రౌడీ జనార్ధన



శ్రీకాకుళం నేపథ్యంతో కూడిన 80వ దశకపు పొలిటికల్ యాక్షన్ డ్రామా 'రౌడీ జనార్ధన'. అగ్ర కథానాయకుడు విజయ్ దేవరకొండ టైటిల్ రోల్ పోషిస్తున్న ఈ చిత్రంలో కీర్తిసురేశ్ కథానాయిక. రవికిరణ్ కోలా దర్శకుడు. దిల్‌రాజు నిర్మాత. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతున్నది. ఇటీవల విడుదల చేసిన గ్లింప్స్‌లో విజయ్ దేవరకొండ మేకోవర్, ఆయన సంభాషణలు పలికిన తీరు, అభిమానుల్నీ, సినీ ప్రేమికులను విశేషంగా ఆకట్టుకున్నది. ఈ గ్లింప్స్ సినిమాపై అంచనాలను కూడా పెంచింది. దిల్‌రాజు ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మే చివరివారం హైదరాబాద్ ఆర్‌ఎఫ్‌సీలో ఈ సినిమాకు సంబంధించిన కొత్త షెడ్యూల్ మొదలుకానున్నది. ఈ షెడ్యూల్‌లో భారీ యాక్షన్ సీక్వెన్స్‌తో పాటు ఓ పాటను కూడా చిత్రీకరిస్తారు. ఇదిలావుంటే.. ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్ ఈ సినిమాకు హైలైట్‌గా నిలుస్తుందని ఇన్‌సైడ్ టాక్.

ఈ ఎపిసోడ్‌లో విజయ్ పూర్తి యాక్షన్ మోడ్‌లో కనిపిస్తారట. మునుపెన్నడూ లేనంతగా ఊరమాస్ పాత్రలో విజయ్ నటిస్తుండటంతో ఈ సినిమా అంచనాలు భారీగా ఏర్పడ్డాయి. షూటింగ్ పూర్తి చేసి, ఈ ఏడాది చివర్లో సినిమాను విడుదల చేయనున్నారు.

## నీకు ఫ్యాన్స్ ఉన్నారా అని అడిగారు.. ట్రోలింగ్‌పై అడివి శేష్ స్పందన వైరల్




టాలీవుడ్ యంగ్ హీరో అడివి శేష్ తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్‌ను క్రియేట్ చేసుకున్న నటుడు. ఆయన సినిమా వస్తుందంటే కచ్చితంగా కొత్తదనం ఉంటుందనే నమ్మకం ప్రేక్షకుల్లో ఏర్పడింది. తాజాగా 'డెకాయిట్' సినిమాతో మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకున్న శేష్, ప్రమోషన్ల సందర్భంగా తనకు ఎదురైన ట్రోలింగ్ అనుభవాన్ని బయటపెట్టారు. గతంలో గూఢచారి 2 గురించి ట్వీట్ చేస్తూ 'ఫ్యాన్స్' అనే పదాన్ని వాడినప్పుడు ఒక నెటిజన్ చేసిన కామెంట్ తనను ఆలోచింపజేసిందని శేష్ తెలిపారు. "అసలు నీకు కూడా ఫ్యాన్స్ ఉంటారా?" అని వ్యంగ్యంగా అడిగిన ఆ కామెంట్ తనకు కొంచెం బాధ కలిగించిందని చెప్పారు.

నేను గూఢచారి ఫ్రాంచైజీని ఇష్టపడే ప్రేక్షకుల గురించి మాట్లాడాను. కానీ దాన్ని వ్యక్తిగతంగా తీసుకుని నన్ను విమర్శించడం జరిగింది. అయినా నేను తగ్గకుండా, నా క్రెడిబిలిటీనే నా బలం అని సమాధానం ఇచ్చాను అని శేష్ గుర్తు చేసుకున్నారు. సాధారణంగా తనకు స్వీయ ప్రచారం చేయడం ఇష్టం ఉండదని శేష్ స్పష్టం చేశారు. నేను చాలా సింపుల్‌గా ఉండాలని ఇష్టపడతాను. అలాంటి వ్యక్తికి ఇలాంటి కామెంట్స్ వచ్చినప్పుడు ఎలా స్పందించాలో కూడా కొన్నిసార్లు అర్థం కాదు అని తెలిపారు. అయితే ఈ సంఘటన తనను మరింత బలంగా మారేలా చేసిందని చెప్పారు.

ఏ సినిమాకైనా అసలైన పరీక్ష 'మండే టెస్ట్' అని ఇండస్ట్రీలో చెబుతారు. ఈ విషయంలో 'డెకాయిట్' ఘనవిజయం సాధించిందని శేష్ ఆనందం వ్యక్తం చేశారు. ప్రస్తుతం థియేటర్లకు IPL, ఓటీటీ, సోషల్ మీడియా వంటి విపరీతమైన పోటీ ఉన్నప్పటికీ, ఈ సినిమా రెండో వారం కూడా బలంగా నిలబడటం విశేషమన్నారు. షారుఖ్ ఖాన్, పవన్ కళ్యాణ్, మహేష్ బాబు వంటి స్టార్ హీరోల మధ్య మా సినిమా నిలబడటం చాలా పెద్ద విషయం అని శేష్ పేర్కొన్నారు. అడివి శేష్ కెరీర్‌ను పరిశీలిస్తే ఆయన ఎప్పుడూ భిన్నమైన కథలను ఎంచుకుంటూ వచ్చారు. క్షణం, గూఢచారి, మేజర్ వంటి సినిమాల నుంచి 'డెకాయిట్' వరకు ప్రతి చిత్రం ఒక కొత్త అనుభూతిని అందించింది. మాస్ ఎలివెంట్స్ కంటే కథా బలం మీదే ఆధారపడుతూ కూడా బాక్సాఫీస్ వద్ద విజయాన్ని సాధించవచ్చని శేష్ మరోసారి నిరూపించారు. ముఖ్యంగా యూత్, ఫ్యామిలీ ఆడియన్స్‌ను థియేటర్లకు రప్పించడంలో 'డెకాయిట్' సక్సెస్ కావడం ఆయన కెరీర్‌లో మరో మైలురాయిగా నిలిచింది.

## పెయిడ్ సబ్‌స్క్రిప్షన్ ట్రెండ్‌లోకి మరో బ్యూటీ!



ఈ మధ్యకాలంలో బాగా వార్తలలో నిలుస్తోన్న అంశం.. సెలబ్రిటీల 'పెయిడ్ సబ్‌స్క్రిప్షన్స్'. సోషల్ మీడియా అకౌంట్స్‌లో ఫాలోయర్స్‌ని పెంచుకుంటూ, వారికి అందాల ఎర వేస్తూ, సబ్‌స్క్రిప్షన్ వైపు నడిపించుకుంటున్నారు. కాస్త పేరున్న భామలందరూ ఇప్పుడీ బాటలోనే నడిచేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే విష్ణు ప్రియ, అనన్య నాగళ్ల వంటి నటీమణులు ఈ పద్ధతి ద్వారా తమ సోషల్ మీడియా క్రేజ్‌ని, ఆదాయ మార్గంగా మార్చుకోగా.. ఇప్పుడు మరో సోషల్ మీడియా స్టార్ అషు రెడ్డి, కూడా అదే బాటలో పయనిస్తున్నారు. తాజాగా ఆమె కూడా ఇన్‌స్టాగ్రామ్‌లో 'పెయిడ్ సబ్‌స్క్రిప్షన్స్' ట్రెండ్‌లోకి అడుగుపెట్టినట్లుగా చెబుతూ ఓ వీడియోను షేర్ చేశారు. ఇప్పుడా వీడియో వైరల్ అవుతోంది. నటిగా, బిగ్ బాస్ ఫేమ్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు ఉన్న ఈ బ్యూటీ, తన ఫాలోయర్స్ కోసం నెలకు రూ. 399 రుసుముతో ఎక్స్‌క్లూజివ్ కంటెంట్‌ను అందుబాటులోకి తీసుకురాబోతున్నట్లుగా ఈ వీడియోలో నవ్వుతూ తెలుపుతున్నారు. ప్రస్తుతం ఆమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో రెండు మిలియన్లకు పైగా ఫాలోయర్స్ ఉన్నారు. సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉంటూ, తాజా ఫొటో షూట్స్‌తో సందడి చేసే అషు రెడ్డి, తన పాపులారిటీని క్యాష్ చేసుకునే ప్రయత్నంలో సక్సెస్ అయ్యారు. సబ్‌స్క్రిప్షన్ ఫీచర్‌ను లాంచ్ చేసిన ఒక్క రోజులోనే ఆమెకు దాదాపు 700 మందికి పైగా సబ్‌స్క్రైబర్లు చేరడం విశేషం. ఈ లెక్కన చూస్తే, కేవలం ఒక్క రోజులోనే దాదాపు రూ. 3 లక్షల ఆదాయాన్ని సునాయాసంగా అందుకున్నారని తెలుస్తోంది. రానున్న రోజుల్లో ఈ సబ్‌స్క్రైబర్ల సంఖ్య మరింత పెరిగే అవకాశం లేకపోలేదు. ఎందుకంటే అమ్మడి పరువాల పవర్ అలాంటిది మరి.రామ్ గోపాల్ వర్మకే మతిపోగొట్టిన అందం అషు రెడ్డి సొంతం. అలాంటి భామ అందరికీ పరువాల విందు ఇస్తానంటే, పైకం చెల్లించకుండా ఉండగలరా? అందుకే, సబ్‌స్క్రైబర్ అయ్యేందుకు క్యూ కడుతున్నారు. తెలుగు సినిమాల్లో కొన్ని పాత్రలతో మెరిసినప్పటికీ, అషు రెడ్డికి సోషల్ మీడియాలో ఉన్న క్రేజ్ అసాధారణమని చెప్పొచ్చు. ముఖ్యంగా ఆమె షేర్ చేసే గ్లామరస్ ఫోటోషూట్స్, వీడియోలకు యూత్ నుండి భారీ స్థాయిలో ఆదరణ లభిస్తుంటుంది. తనకంటూ ఉన్న ఈ బలమైన ఫాలోయింగ్‌ను, అభిమానులకు ఇలా సబ్‌స్క్రిప్షన్ పేరిట కొత్త ఆదాయ వనరుగా మార్చుకుంటోంది. ప్రస్తుతం ఈ అంశంపైనే భారీ స్థాయిలో చర్చలు నడుస్తున్నాయి. ఈ సబ్‌స్క్రిప్షన్ విషయమై పోలీసులకు కూడా ఫిర్యాదులు అందుతున్నట్లుగా తెలుస్తోంది. ఆల్రెడీ విష్ణు ప్రియపై కేసు కూడా నమోదైంది. మరి, ఈ విధానానికి అంతం, అదుపు.. ఏ రూపంలో ఉంటుందనేది తెలియాలంటే మాత్రం వేచి చూడాల్సిందే.

## నా జుట్టు మెరుపు వెనుక ఉన్న రహస్యం ఇదే... శ్రేయా ఘోషాల్



ప్రముఖ గాయని శ్రేయా ఘోషల్ తన పొడవైన, నిగనిగలాడే జుట్టు వెనుక ఉన్న రహస్యాన్ని అభిమానులతో పంచుకున్నారు. లండన్‌లో బ్రిటిష్ వోగ్ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో, తన జుట్టు అందానికి కారణం ఒక సాధారణ భారతీయ చిట్కా అయిన 'కొబ్బరి నూనె' అని ఆమె వెల్లడించారు. ఈ సింపుల్ సమాధానం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కన్సర్ట్ టూర్‌లో భాగంగా లండన్ వెళ్లిన శ్రేయా, అక్కడి ప్రతిష్ఠాత్మక ఓ2 ఎరీనాలో హౌస్‌ఫుల్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో, "మీ జుట్టు ఇంత అందంగా, మెరిసిపోతూ ఎలా ఉంటుంది?" అని అడిగిన ప్రశ్నకు ఆమె బదులిస్తూ "ఇండియన్ చిట్కా... కొబ్బరి నూనె" అని నవ్వుతూ చెప్పారు. ఈ కచేరీలో ఆమె పొడవైన జుట్టుతో ప్రత్యేకంగా కనిపించగా, ఆ లుక్‌పై అభిమానులు ప్రశంసలు కురిపించారు. ఇదే వేదికపై ఆమె లెజెండరీ సింగర్ ఆశా భోస్లేకునివాళి అర్పించారు.ఆశా ఆలపించిన "దమ్ మారో దమ్", "అభీ నా జావో ఛోడ్ కర్" వంటి క్లాసిక్ పాటలను పాడి ఆమె సంగీత సేవలను గుర్తుచేసుకున్నారు. ఒక అంతర్జాతీయ స్టార్‌గా ఉండి కూడా శ్రేయా ఘోషల్ తన మూలాలను మర్చిపోకుండా, భారతీయ సంప్రదాయ పద్ధతులనే అనుసరించడం ఆమె సరళతను తెలియజేస్తోందని పలువురు ప్రశంసిస్తున్నారు.

## 'ధురంధర్ 2' దూకుడు.. కానీ

## 'బాహుబలి 2', 'దంగల్' రికార్డులు అందని ద్రాక్షే!





రణవీర్ సింగ్ హీరోగా, ఆదిత్య ధర్ దర్శకత్వంలో తెరకెక్కిన 'ధురంధర్ 2' సినిమా ఇండస్ట్రీకి కొత్త ఊపిరి పోసింది. బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతూ భారీ వసూళ్లు సాధించిన ఈ చిత్రం, టాప్ రికార్డులను సైతం దాటేస్తుందని భావించారు. అయితే చివరికి బాహుబలి 2, దంగల్ సినిమాల రికార్డులను మాత్రం అందుకోలేకపోయింది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, 'ధురంధర్ 2' ప్రపంచవ్యాప్తంగా రూ. 1764.15 కోట్ల వసూళ్లు సాధించింది. అయితే 'బాహుబలి 2' రూ. 1788.06 కోట్లతో ముందంజలో ఉండగా, ఆమిర్ ఖాన్ నటించిన 'దంగల్' రూ. 2070.3 కోట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. దీంతో 'ధురంధర్ 2' టాప్ ప్లేస్‌కు దగ్గరగా వచ్చినా, చివరి అడుగులో వెనుకబడింది. 'దంగల్' సినిమాకు చైనా మార్కెట్ భారీగా కలిసి వచ్చింది. కేవలం ఆ దేశంలోనే రూ. 1305 కోట్లకు పైగా వసూళ్లు సాధించడం దాని విజయానికి ప్రధాన కారణం. కానీ 'ధురంధర్ 2'కు చైనాలో అలాంటి అవకాశం దక్కలేదు. మరోవైపు గల్ఫ్ దేశాల్లో నిషేధం విధించడంతో కూడా కలెక్షన్లపై ప్రభావం పడింది. అక్కడ విడుదలై ఉంటే అదనంగా రూ.100 కోట్ల వరకు వసూళ్లు వచ్చేవని అంచనా. దక్షిణాది రాష్ట్రాల్లో 'ధురంధర్ 2'కు మంచి స్పందన లభించినా, వసూళ్లు మాత్రం అంచనాలకు తగ్గట్టుగా రాలేదు. పుష్ప 2, ఆర్‌ఆర్‌ఆర్ వంటి పాన్ ఇండియా సినిమాలు హిందీతో పాటు దక్షిణాదిలోనూ భారీ వసూళ్లు సాధించాయి. కానీ 'ధురంధర్ 2' మాత్రం ఆ స్థాయిలో మెప్పించలేకపోయింది. భాషల వారీగా చూస్తే తెలుగు: రూ. 42.56 కోట్లు, తమిళం: రూ. 19.39 కోట్లు, కన్నడ: రూ. 3.66 కోట్లు,మలయాళం: రూ. 1.77 కోట్లు.. ఈ సంఖ్యలు పాన్ ఇండియా సినిమాలతో పోలిస్తే తక్కువగానే కనిపిస్తున్నాయి. ఈ సినిమాకు సెన్సార్ బోర్డు నుంచి 'ఎ' సర్టిఫికేట్ రావడం కూడా ఒక కారణంగా మారింది. 18 ఏళ్ల పైబడిన ప్రేక్షకులకే పరిమితమవడంతో ఫ్యామిలీ ఆడియన్స్ థియేటర్లకు రావడంలో వెనుకబడ్డారు. అదేవిధంగా సినిమా నిడివి 3 గంటల 49 నిమిషాలు ఉండటం, ఎక్కువ హింస ఉండటం కూడా కొంత మంది ప్రేక్షకులను దూరం చేసింది. మొత్తానికి 'ధురంధర్ 2' భారీ విజయాన్ని సాధించినప్పటికీ, టాప్ రికార్డులను బద్దలు కొట్టడంలో కొన్ని అంశాలు అడ్డుగా నిలిచాయి. అయినప్పటికీ, బాలీవుడ్‌కు ఈ సినిమా ఇచ్చిన బూస్ట్ మాత్రం విశేషమని చెప్పాలి.

### నేను చేసిన ఆ ఒక్క మిస్టేక్ వల్ల ఠాగూర్ నా చేతి నుంచి జారిపోయింది

ఠాగూర్ చిత్రంలో చిరంజీవి హీరోగా నటించి భారీ విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. ఇక ఈ సినిమా మొదటగా రాజశేఖర్ చేయాల్సిందని, కొన్ని కారణాల వల్ల అది చిరంజీవికి వెళ్లిందని చాలా కాలంగా వార్తలు వినిపిస్తున్నాయి. తాజాగా ఈ వార్తలపై రాజశేఖర్ స్పందించారు. ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... తమిళంలో వచ్చిన రమణ సినిమా చూసిన తర్వాత అది తనకు చాలా నచ్చిందని తెలిపారు. దాంతో ఆ సినిమాను తెలుగులో రీమేక్ చేయాలని నిర్ణయించుకున్నానని, వెంటనే ఆ సినిమా నిర్మాతను కలిసి రేటు కూడా మాట్లాడుకున్నానని, అన్ని విషయాలు ఓకే అయ్యాయని తెలిపారు. అయితే ఆ నిర్మాత తనకు స్నేహితుడు కావడంతో అగ్రిమెంట్ మాత్రం చేసుకోలేదని తెలిపారు. ఆ తర్వాత మధు, చిరంజీవితో ఠాగూర్ సినిమాను నిర్మించేందుకు అదే నిర్మాతను కలిసి, తాను చెప్పిన దానికంటే ఎక్కువ మొత్తాన్ని ఇస్తానని చెప్పారని, దాంతో ఆ నిర్మాత కూడా ఆ సినిమా హక్కులను మధుకు ఇవ్వడానికి ఒప్పుకున్నారని తెలిపారు. వెంటనే వారు అగ్రిమెంట్ చేసుకోవడంతో ఆ సినిమా రీమేక్ హక్కులు వారికి వెళ్లాయని చెప్పారు. "నేను మొదట అగ్రిమెంట్ చేసుకుని ఉండి ఉంటే ఆ సినిమాను తెలుగులో చేసే అవకాశం నాకు దక్కేది. నా స్నేహితుడు అనే నమ్మకంతో అగ్రిమెంట్ చేయకపోవడమే ఆ సినిమా విషయంలో నేను చేసిన పెద్ద తప్పు అని రాజశేఖర్ తాజాగా వెల్లడించారు.



## ఏడాది తర్వాత రన్యా రావుకు

# బెయిల్

బెంగళూరు, ఏప్రిల్ 24, : దేశవ్యాప్తంగా సంచలనం రేపిన కన్నడ నటి రన్యా రావు బంగారం స్మగ్లింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితురాలిగా ఉన్న నటికి.. ఎట్టకేలకు బెయిల్ మంజూరయ్యింది. ఏడాది నుంచి ఆమె బెయిల్ కోసం చేస్తోన్న ప్రయత్నాలు ఎట్టకేలకు ఫలించాయి. ప్రస్తుతం రన్యా రావు పరప్పన అగ్రహారం సెంట్రల్ జైల్లో ఖైదీగా ఉన్నారు. బంగారం అక్రమ రవాణా కేసులో ఆరోపణలు ఎదుర్కొంటూ.. ఏడాది నుంచి జైల్లో ఉన్న కన్నడ నటి రన్యా రావుకు ఊరట లభించింది. కర్ణాటక కోర్టు ఆమెకుబుధవారం నాడు బెయిల్‌నుమంజూరు చేసింది. మొత్తం రూ.102 కోట్ల విలువైన బంగారాన్ని దుబాయ్ నుంచి దేశానికి అక్రమంగా తరలించారనేది ప్రధాన ఆరోపణ. ఆర్థిక నేరాల విచారణ న్యాయస్థానం బెయిల్ మంజూరు చేయడంతో రన్యా రావు జైలు నుంచి త్వరలోనే విడుదల కానున్నారు. దుబాయ్ నుంచి బెంగళూరుకు 14.8 కిలోల బంగారాన్ని అక్రమంగా తరలిస్తుండగా గతేడాది మార్చి 3న కెంపెగౌడ విమానాశ్రయంలో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులకు రన్యా రావు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఈ భారీ స్మగ్లింగ్ కేసు దేశవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించింది. కర్ణాటక సీనియర్ పోలీస్ అధికారి కే. రామచంద్రరావుకు రన్యా రావు సవతి కూతురు. ఈ కేసులో ఆయన పాత్రపై కూడా అప్పట్లో అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ కేసులో ఏడాది నుంచి బెంగళూరులోనిపరప్పన అగ్రహారం సెంట్రల్ జైల్లోనే నటి రన్యారావుఉన్నారు. ఆమె బెయిల్ కోసం అనేకసార్లు చేసిన ప్రతిపాదనలను కోర్టులు తిరస్కరించాయి. కేసు తీవ్రత దృష్ట్యా హైకోర్టు ఆమె బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసింది. అంతేకాదు, రన్యా రావుపై 'విదేశీ మారక ద్రవ్య రక్షణ, స్మగ్లింగ్ కార్యకలాపాల నివారణ' చట్టం కింద కేసు నమోదయ్యింది. ఈ చట్టం కింద అరెస్టైన వారు తప్పనిసరిగా ఏడాది జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుంది. అందుకే గత ఏడాది కాలంగా బెయిల్ కోసం ఆమె చేసిన ప్రయత్నాలు విఫలయమ్యాయి. రూ. 102 కోట్ల విలువైన బంగారం స్మగ్లింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రన్యా రావు పాత్రపై పక్కా ఆధారాలతో ప్రత్యేక కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. సీనియర్ ఐపీఎస్ అధికారికి ఆమె సవతి కుమార్తె కావడంతో తనను ఎవరూ తనిఖీ చేయరనే ధైర్యంతో బంగారం స్మగ్లింగ్‌కుతెరతీసింది. కేవలం15రోజుల వ్యవధిలో రన్యా రావు నాలుగు సార్లు దుబాయ్ పర్యటనకు వెళ్లడం అనుమానం రేకెత్తించింది. దీంతో 2025 మార్చి 3న దుబాయ్ నుంచ తిరిగొస్తుండగా విమానాశ్రయం ఎగ్జిట్ గేట్ వద్ద రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు అడ్డుకుని తనిఖీ చేయడంతో గుట్టురట్టయ్యింది. ఏకంగా ఆమె వద్ద 14.2 కిలోల బంగారం బయటపడింది. కమిషన్ కోసం కక్కుర్తిపడి గోల్డ్ స్మగ్లింగ్‌లో భాగస్వామ్యమైనట్టు తేలింది. కిలోకు రూ.4-5 లక్షలు కమిషన్‌గా వచ్చేదని ఈడీ విచారణలో వెల్లడయ్యింది. ఇక, ఈ కేసులో రన్యారావుతో పాటు తెలుగు వ్యక్తి తరుణ్ కొండూరు, బళ్లారికి చెందిన వ్యాపారి సాహిల్ సకారియా జైన్‌లు కూడా ఉన్నారు.

# ఆత్మహత్యలొద్దు..

# తెగించి పోరాడుదాం



**ఆర్టీసీ కార్మికులతో తగవుపెట్టుకుంటే పతనం తప్పదు**

**యూనియన్లంటే పాలకులకు భయమెందుకు**

**ప్రజారవాణాను ప్రైవేటీకరించేందుకు ప్రభుత్వం కుట్ర**

**చట్టపరమైన సమ్మెపై నిర్బంధాలు ఆపండి**

**డిమాండ్లు పరిష్కరించేవరకు ఆర్టీసీ కార్మికులకు అండగా ఉంటాం**

**శంకర్ గౌడ్ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి**

**ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**



కొత్తగూడెం (తెలంగాణ వాణి): సమస్యల పరిష్కారం కోసం ప్రాణాలు తీసుకోవద్దని, ఆత్మహత్యలు సమస్యకు పరిష్కారం కాదని, తెగించి పోరాడి హక్కులను సాధించుకుందామని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన సమ్మె శుక్రవారం నాటికి మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా బస్టాండ్ ఔట్ గేట్ నుంచి ఇన్ గేట్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించి బస్టాండు రోడ్డుపై ధర్నా చేపట్టారు. ధర్నాలో పాల్గొన్న ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడుతూ కార్మికులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వానికైనా పతనం తప్పదని, ఆర్టీసీ కార్మికులతో తగవుపెట్టుకోవడం పాలకుల వినాశనానికి నాంది పలికే ప్రమాదం ఉందని, గత ప్రభుత్వ తప్పిదమే ప్రస్తుత ప్రభుత్వం చేస్తోందని విమర్శించారు. కార్మిక యూనియన్లంటే పాలకులకు ఎందుకు అంత భయమని, హక్కుల కోసం పోరాడే గొంతులను నొక్కేయాలని చూడటం ప్రజాస్వామ్య విరుద్ధమని మండిపడ్డారు. ప్రజారవాణా వ్యవస్థను నిర్వీర్యం చేసి, కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతోందని, అందులో భాగంగానే ప్రైవేటీకరణ దిశగా అడుగులు వేస్తూ కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం, ట్రేడ్ యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేత, గుర్తింపు సంఘం ఎన్నికలు, వేతన సవరణ, పనిభద్రత, బకాయిలు, పనిభద్రత, కొత్తబస్సుల కొనుగోలు తదితర డిమాండ్లు ప్రభుత్వానికి సాధ్యం కానివికాదని పేర్కొన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా మాట్లాడుతూ చట్టబద్ధంగా సమ్మె చేస్తుంటే అరెస్టులు, అక్రమ నిర్బంధాలు ఎందుకు విధిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం తన మొండివైఖరిని వీడకుండా రాష్ట్రంలో ఎమర్జెన్సీ తరహా పరిస్థితులను తీసుకొస్తోందని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరిచి ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించి, సమ్మెను నివారించాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు నెరవేరే వరకు తాము ఆర్టీసీ కార్మికులకు పూర్తిఅండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్మికుడు శంకర్ గౌడ్ మృతికి ప్రభుత్వమే బాధ్యతవహించాలని, తక్షణమేఆయన కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నిర్బంధాలు పెరిగే కొద్దీ ఉద్యమం మరింత ఉధృతమవుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కందుల భాస్కర్, కంచర్ల జమలయ్య, సలిగంటి శ్రీనివాస్, మిర్యాల రంగయ్య, ఎస్ కె ఫహీమ్, జిల్లా సమితి సభ్యులు వంగ వెంకట్, కె రత్నకుమారి, నేరెళ్ల రమేష్, భూక్యా శ్రీనివాస్, రమణమూర్తి,, నాయకులు ఎర్రబెల్లి శంకర్, గుమ్మడెల్లి దుర్గయ్య, నాయకులు నిమ్మగడ్డ వెంకటేశ్వర్ రావు, యూసుఫ్, సత్యనారాయణాచారి, షాహీన్, కైసర్, మేదిని లక్ష్మి, షమీమ్ తదితరులు పాల్గొన్నారు.

# భవిష్యత్తుకు తగ్గ అధ్యాపకులను తీర్చిదిద్దుతాం

**గీతం స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఫ్యాకల్టీ రూమ్స్, కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభోత్సవంలో డాక్టర్ రిచా శర్మ**



పటాన్ చెరు (తెలంగాణ వాణి రిపోర్టర్) భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న అధ్యాపకులను తీర్చిదిద్దే చైతన్యవంతమైన కేంద్రంగా గీతం స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ ను రూపొందించినట్టు విభాగాధిపతి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రిచా శర్మ పేర్కొన్నారు. హైదరాబాదు లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ కోసం కొత్తగా రూపొందించిన అధ్యాపకుల గదులు, విద్యార్థుల కోసం నెలకొల్పిన కంప్యూటర్ ల్యాబ్ ను అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు శుక్రవారం లాంఛనంగా ప్రారంభించి, అత్యాధునిక సౌకర్యాలతో కూడిన ఆయా ప్రదేశాలను ఆయన సందర్శించారు.

ఈ సందర్భంగా డాక్టర్ రిచా శర్మ మాట్లాడుతు ఈ కొత్త మౌలిక సదుపాయాల వెనుక ఉన్న దార్శనికతను వివరించారు. విద్యా పరమైన సహకారాన్ని, అర్థవంతమైన సంభాషణలను ప్రోత్సహించి, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా అధ్యాపకులను తీర్చిదిద్దుతున్నట్టు తెలియ జేశారు. వినూత్నమైన అభ్యాస వాతావరణాన్ని సృష్టించడం ద్వారా గీతం యొక్క బహుళ విషయక విద్యా సంస్కృతిని బలోపేతం చేయడానికి తమ స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ కట్టుబడి ఉందన్నారు. జాతీయ విద్యా విధానం-2020 దార్శనికతకు అనుగుణంగా, 2026-27 విద్యా సంవత్సరం నుంచి రెండు నాలుగేళ్ల సమీకృత ఉపాధ్యాయ విద్యా కార్యక్రమాలను (ఐటీఈపీ) ప్రారంభించనున్నట్టు కూడా డాక్టర్ రిచా శర్మ ప్రకటించారు. విషయ పరిజ్ఞానాన్ని వృత్తిపరమైన ఉపాధ్యాయ శిక్షణతో అనుసంధానించేలా బీఎస్సీ బీఈడీ, బీఏ బీఈడీ కోర్సులను రూపొందించినట్టు తెలియజేశారు. బలమైన బోధనా నైపుణ్యాలు, తరగతి గది నిర్వహణ సామర్థ్యాలు, సమకాలీన విద్యా పద్ధతులపై విద్యార్థులు లోతైన అవగాహనను పెంపొందించుకుంటూ, సైన్స్, గణితం, ఆంగ్లం లేదా సాంఘిక శాస్త్రాలలో ప్రత్యేకత సాధిస్తారని ఆమె వివరించారు. వ్యక్తిగత మార్గదర్శనం, ఉన్నత-నాణ్యత గల విద్యా ప్రమాణాలను నిర్ధారించడానికి, ఒక్కో కోర్సులో 50 మంది విద్యార్థులకు మాత్రమే ప్రవేశం కల్పిస్తామని డాక్టర్ రిచా శర్మ వెల్లడించారు. ప్రతిభావంతులైన అభ్యర్థులకు ఉపకార వేతనాలిచ్చి ప్రోత్సహిస్తున్నామన్నారు. నిష్పక్షపాతమైన, ప్రతిభ ఆధారిత ఎంపిక ప్రక్రియను నిర్ధారిస్తూ, జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి తరఫున జాతీయ ఉమ్మడి ప్రవేశ పరీక్ష (ఎన్.సీ.ఆర్.టీ)లో చూపిన ప్రతిభ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామని ఆమె స్పష్టీకరించారు. స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ స్థాపనతో, భవిష్యత్తు తరగతి గదులను తీర్చిదిద్దగల సమర్థవంతమైన, దూరదృష్టి గల విద్యావేత్తలను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో, విద్యాపరమైన శ్రేష్ఠత, ఆవిష్కరణల పట్ల గీతం తన నిబద్ధతను మరోసారి పునరుద్ఘాటిస్తోందన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, ఆతిథ్య విభాగం-క్యాంపస్ లైఫ్ డైరెక్టర్ అంబికా ఫిలిప్ లతో పాటు పలువురు డైరెక్టర్లు, ప్రిన్సిపాళ్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఈ కార్మికుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి

**సమ్మె కార్మికుల హక్కు - మాజీ మంత్రి జీవన్ రెడ్డి**



జగిత్యాల: ఏప్రిల్ 24 (తెలంగాణ వాణి ప్రతినిధి): డిమాండ్ల పరిష్కారం కోసం సమ్మెలు నిర్వహించడం కార్మికుల హక్కు అని మాజీ మంత్రి, టిఆర్ఎస్ పార్టీ కార్యదర్శి జీవన్ రెడ్డి అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ డిపో ఎదుట కార్మికులు నిర్వహిస్తున్న సమ్మెకు మద్దతు తెలిపారు. మాజీ మంత్రి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి మాట్లాడుతూ కార్మికులు సమ్మెకు పోవడం దురదృష్టకరం అని ఆయన అన్నారు. ప్రభుత్వ నిర్లక్షం వల్లనే ఈ పరిస్థితి వచ్చిందన్నారు. గత ప్రభుత్వం ఆర్టీసీ ని ప్రభుత్వంలో విలీనం చేయాలని చర్చించారు. గతంలో ఆర్టీసీ విలీన ప్రతిపాదన శాసన సభలో శాసన మండలిలో ఏకగ్రీవ ఆమోదం తెలుపడం జరిగిందని వెల్లడించారు. గతంలో ఉద్యమ బలోపేతం గురించి ప్రధాన పాత్ర పోషించిందని కార్మికులు పేర్కొన్నారు. ఈ ప్రభుత్వం ఆర్టీసి సమస్యలపైన ఎందుకు జాప్యం చేస్తుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థ దీనిని బలోపేతం చేసుకోవాలన్నారు. మహాలక్ష్మి పథకం అమలు కారణం ఆర్టీసి సంస్థ కార్మికులు అన్నారు. ఆక్యుపెన్సీ పెరిగింది బస్ ల సంఖ్య పెంచాలి కాని ఉన్న బస్ డిపో లను తీసి వేస్తున్నట్లు విమర్శించారు. ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మరణం ప్రభుత్వానికి చెంప పెట్టు అని, కార్మికులు రోడ్ ఎక్కడానికి రేవంత్ రెడ్డి పరోక్షంగా కారణం అని మండిపడ్డారు. ప్రభుత్వ ఆస్తులు అమ్మకమే రేవంత్ రెడ్డి ఆదాయం అని, ఆర్టీసి సంస్థను ప్రైవేటీకరణ చేయడమే ఈ ప్రభుత్వ లక్ష్యంగా ఉందన్నారు. ఇందుకు మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా ఇందులో బాధ్యుడని ఆరోపించారు. వేతన భత్యాల సవరణ రాజ్యాంగం కల్పించిన హక్కు అని ఆయన అన్నారు. ఎలక్ట్రిక్ బస్సులు ఆర్టీసీ సంస్థ కి ఇచ్చినట్లయితే ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయన్నారు. కార్మికుల ఆత్మహుతి బలిదానాలు సమస్యలకు పరిష్కారం కాదని, కార్మికులు సంయమనం పాటించాలని సూచించారు. కార్మికుల డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం పైన ఒత్తిడి తేవడానికి బి ఆర్ ఎస్ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. ఈ ఉద్యమం శంకర్ గౌడ్ మరణం ఆనాటి శ్రీకాంత చారి బలిదానం తలపిస్తుందన్నారు. శంకర్ గౌడ్ కుటుంబానికి కోటి రూపాయల పరిహారంతో పాటు కుటుంబంలో ఉద్యోగం ఇవ్వాలన్నారు. శంకర్ గౌడ్ మృతితో రేవంత్ రెడ్డి కండ్లు తెరవాలని, ఈ రోజు చర్చలు కాదు సమస్యలకు పరిష్కారం కావాలన్నారు. గత ఎన్నికల్లో ఈ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఆర్టీసీ కార్మికులకు సంస్థకు ఏమి హామీలు ఇచ్చిందో చదువుకోవాలని హితవు పలికారు. శంకర్ గౌడ్ మరణం చాలా బాధ అనిపించిందని, ఇది పునరావుతం కాకూడదన్నారు. శంకర్ గౌడ్ కుటుంబానికి కార్మికుల పక్షాన కూడా తోడుగా ఉండాలని సూచించారు. కార్మికుల సమస్యలను అన్నింటిని ఈ ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. ఇప్పుడూ యూనియన్ల అవసరం ఉంది యూనియన్ల పునరుద్ధరణ చేయాలని తెలిపారు. శంకర్ గౌడ్ ఆత్మకి శాంతి చేకురాలి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు.

**కార్మికుల ఉసురు తగులుతుంది**

**బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్**

మంచిర్యాల : రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్టీసీ కార్మికుల ఉసురు తగులుతుందని బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ అన్నారు. శుక్రవారం మంచిర్యాల ఆర్టీసీ డిపోలో కార్మికులు తలపెట్టిన సమ్మె కు సంఘీభావం తెలిపారు. నర్సంపేట ఆర్టీసీ డిపోలో డ్రైవర్ గా పనిచేస్తున్న కోలా శంకర్ గౌడ్ పెట్రోలు పోసుకొని నిప్పంటించుకుని గాయాలతో బాధపడుతూ మృతి చెందడం తీవ్ర బాధాకరమన్నారు. బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రభుత్వం రూ.1 కోటి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. అన్ని విధాల కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. మృతి చెందిన కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఆర్టీసీని ప్రభుత్వ రంగ సంస్థగా గుర్తించి ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణలోకి తీసుకొస్తామన్న హామీలు గాలి మాటలు గానే మిగిలిపోయాయి అన్నారు. ప్రభుత్వంలోకి వచ్చి రెండు సంవత్సరాలు అయిన ఆర్టీసీ కార్మికుల గోడును వినిపించుకోలేదన్నారు. సమ్మె చేస్తున్న కార్మికుల సమస్యలపై కనీసం చర్చలు జరపకుండా కాలయాపన చేయడం సిగ్గు చేటన్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం 58 రోజులపాటు ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తే కనీసం వారి సమస్యలు విన్న పాపాన పోలేదన్నారు. అప్పుడు 28 మంది కార్మికుల ఆత్మహత్యకు కారకుడు అయ్యారని ఆరోపించారు. ప్రస్తుతం అదే విధానాన్ని సీఎం రేవంత్ రెడ్డి అవలంబిస్తున్నారని ధ్వజమెత్తారు. కార్మికుల ఉసురు తగిలి తగిన మూల్యం చెల్లించక తప్పదు అన్నారు. తక్షణమే శంకర్ గౌడ్ కుటుంబాన్ని ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలగందుల.కృష్ణమూర్తి, వంగపల్లి.వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వైద్య.శ్రీధర్, పట్టణ అధ్యక్షుడు అమీర్ శెట్టి.రాజు, నాయకులు బెల్లంకొండ మురళి, శ్రీనివాస్, రాజబాబు, రాజన్న, కరీం, శ్రీనివాస్, శివ తదితరులు పాల్గొన్నారు.

# నైపుణ్యాభివృద్ధితో యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు

## జిల్లా కలెక్టర్ అంకిత్



భద్రాద్రి బ్యూరో (తెలంగాణ వాణి): ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సంక్షేమ వారం కార్యక్రమాలలో భాగంగా పాల్వంచలో శుక్రవారం నవ ఒకేషనల్ లో నైపుణ్యాభివృద్ధి అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అంకిత్ ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ కేంద్రంలో జరుగుతున్న కార్యకలాపాలను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వివిధ వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ పొందుతున్న మహిళలు, పురుషులతో కలెక్టర్ ప్రత్యక్షంగా మట్లాడి వారికి అందుతున్న శిక్షణ నాణ్యత, శిక్షణ కాలవ్యవధి, శిక్షణ అనంతర ఉపాధి అవకాశాలు, ఉత్పత్తుల మార్కెటింగ్ విధానాలు, ఆదాయ సాధన అవకాశాలపై వివరాలు తెలుసుకున్నారు. శిక్షణార్థుల అభిప్రాయాలను తెలుసుకుని, శిక్షణను మరింత ఫలప్రదంగా నిర్వహించేలా సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన లక్ష్యంగా 2010లో స్థాపించబడిన "నవ భారత్ వొకేషనల్ ఇనిస్టిట్యూట్" ద్వారా పరిసర ప్రాంతాల పేద యువతకు వెల్డింగ్, ఎలక్ట్రికల్, ఫిట్టర్, సోలార్ టెక్నీషియన్ వంటి వృత్తి విద్యా కోర్సుల్లో నాణ్యమైన ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు అధికారులు వివరించారు. ఇప్పటివరకు 2200 మందికి స్టైఫండ్‌తో కూడిన శిక్షణ అందించగా, ప్రస్తుత సంవత్సరంలో 80 మందికి శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించామని తెలిపారు. శిక్షణ పొందిన అభ్యర్థులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పరిశ్రమలతో పాటు ప్రైవేటు సంస్థల్లో, అలాగే విదేశాల్లో కూడా ఉపాధి పొందడం గర్వకారణమని కలెక్టర్ అన్నారు . కొంతమంది స్వయం ఉపాధి ద్వారా తమ జీవనోపాధిని స్థిరపరచుకోవడం ప్రోత్సాహకరమని అన్నారు. అనంతరం నిర్వహించిన అవగాహన సదస్సులో కలెక్టర్ మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో వృత్తి విద్య కు ఉన్న ప్రాధాన్యతను యువత సరిగా అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సంప్రదాయ విద్యతో పాటు వృత్తి నైపుణ్యాలు కలిగి ఉంటేనే ఉద్యోగ అవకాశాలు విస్తృతంగా లభిస్తాయని తెలిపారు. కేవలం డిగ్రీలు పొందడం సరిపోదని, ఉద్యోగ రంగం అవసరాలకు అనుగుణంగా ప్రాక్టికల్ స్కిల్స్‌ను అభ్యసించడం అత్యంత ముఖ్యమని స్పష్టం చేశారు. ప్రస్తుతం పరిశ్రమలు, సర్వీస్ రంగాలు నైపుణ్యంతో కూడిన సిబ్బందిని కోరుకుంటున్నాయని, వెల్డింగ్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్, ఫిట్టింగ్, సోలార్ టెక్నాలజీ, మెషిన్ ఆపరేషన్, డిజిటల్ సర్వీసులు వంటి రంగాల్లో శిక్షణ పొందిన వారికి మంచి డిమాండ్ ఉందన్నారు. ఈ కోర్సులు తక్కువ కాలంలో నేర్చుకునే వీలుతో పాటు త్వరగా ఉపాధి పొందే అవకాశం కల్పిస్తాయని తెలిపారు. వృత్తి విద్య కేవలం ఉద్యోగాలకు మాత్రమే పరిమితం కాకుండా స్వయం ఉపాధికి కూడా బలమైన మార్గం చూపుతుందని అన్నారు. శిక్షణ పొందిన యువత చిన్న స్థాయిలో యూనిట్లు ప్రారంభించి క్రమంగా వ్యాపారాలను విస్తరించుకోవచ్చని, దీనివల్ల ఇతరులకు కూడా ఉపాధి అవకాశాలు సృష్టించవచ్చని, ప్రపంచ స్థాయిలో జపాన్, రష్యా వంటి దేశాలు వృత్తి విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తూ పారిశ్రామిక అభివృద్ధి సాధిస్తున్నాయని, అదే విధంగా మన దేశంలో కూడా నైపుణ్యాభివృద్ధి ద్వారా ఆర్థిక పురోగతిని సాధించవచ్చని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ పథకాలను యువత పూర్తిగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న శిక్షణ కార్యక్రమాలు, పథకాలను సమర్థవంతంగా వినియోగించుకుని యువత స్వయం ఉపాధి సాధించి ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. చేతివృత్తులకు గౌరవం పెంచుకుని చిన్న స్థాయిలో ప్రారంభించిన వ్యాపారాలను క్రమంగా అభివృద్ధి చేసుకుంటే మంచి భవిష్యత్తు సాధ్యమవుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధునిక సదుపాయాలతో ఏటీసీ కేంద్రాల ద్వారా వృత్తి విద్యా కోర్సుల్లో నైపుణ్యం సాధించేలా విస్తృత కార్యక్రమాలు చేపడుతోందని, సంప్రదాయ కోర్సులతో పాటు సోలార్ ఎనర్జీ, డిజిటల్ టెక్నాలజీ, ఆధునిక సాంకేతిక రంగాల్లో శిక్షణ పొందడం ద్వారా మెరుగైన ఉపాధి అవకాశాలు పొందవచ్చని సూచించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు కలెక్టర్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు ప్రదానం చేయడంతో పాటు, చేతివృత్తుల ద్వారా గత నెలలో సాధించిన ఆదాయానికి గుర్తింపుగా చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఓ సంజీవరావు, తహసీల్దార్ ధారా ప్రసాద్, నవ భారత్ వొకేషనల్ ఇనిస్టిట్యూట్ హెచ్ఆర్ శ్రీనివాసరెడ్డి, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి శ్రీలత, బీసీ సంక్షేమ శాఖ అధికారి విజయలక్ష్మి, ఎస్సీ కార్పొరేషన్ అధికారి ఉపేందర్, ఏపీఎం వెంకయ్య, మహిళా సాధికారిక ప్రతినిధులు, నవ ఒకేషనల్ సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com